www.janashaktionline.com

# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి : 44 సంచిక : 11 విజయవాడ 5-10-2011 పేజీలు : 8 వెల: రు 5.00

లోపలి పేజీల్లో...


- అధ్యయన విధానంలో సంస్కరణ – మావో
- కార్మికులు పొదుపు చేసుకున్న సొమ్మును లూటీచేసే పెన్షన్ పథకాలు
- క్రక్స్ బయోటెక్ డిస్టిలరీ యూనిట్ అనుమతికి పాలకుల సన్నాహాలు
- పంటల రక్షణకు యుద్ధప్రాతిపదికపై చర్యలు చేపట్టాలి
- మధ్యప్రదేశ్, హర్యానా : భూముల సేకరణకు ప్రజల నిరసన


## గ్రామీణ ఉపాధి పథక ప్రైవేటీకరణకు అడుగులు

**ఇప్పటి** వరకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన చట్టాలు, పథకాల మాదిరిగానే మహాత్మాగాంధి గ్రామీణ ఉపాధి హామీ చట్టం కూడా ఆచరణలో పూర్తిగా విఫలమైంది. కుటుంబానికి వందరోజులు పని కల్పించటంలోనూ, కూలీలకు వేతనాలు చెల్లించటంలోనూ, మౌలిక వసతులు కల్పించటంలోనూ ఈ వైఫల్యం స్పష్టంగా కన్పిస్తున్నది.

ప్రధాని మన్మోహన్‌సింగ్, యుపిఎ అధ్యక్షురాలు సోనియాగాంధి ఎంతో ఆర్భాటంగా, అట్టహాసంగా మన రాష్ట్రంలోని అనంతపురంజిల్లా బద్లపల్లిలో 2-2-2006న ఈ పథకాన్ని మొదటగా ప్రారంభించారు. చెరువులు, పంట-మురుగు కాల్వల మరమ్మత్తులు, గుర్రపుడెక్కల తొలగింపు, కాల్వకట్టలను పటిష్టపర్చటం, భూమి అభివృద్ధి పనులు చేపట్టటం, పొలాలకు రహదార్లు నిర్మించటం, గ్రామాల్లో రోడ్లనిర్మాణం, పశుగ్రాసం పెంచే పనులు మొదలైనవి ఈ పథకం క్రింద చేపట్టాల్సి వుంది.

### తగ్గుతున్న పనిదినాలు

ఈ పథకం పేదల జీవితాల్లో వెలుగు నింపుతుందని, పేదరికాన్ని రూపుమాపుతుందని, వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి అభివృద్ధి అవుతుందని యుపిఎ ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేసింది. ఈ పథకం తన గొప్పతనంగా డబ్బాలు కొట్టుకుంది. ఈ చట్టం అమలులోకి వచ్చిన దగ్గర నుండీ ఏ సంవత్సరంలోనూ 100రోజుల పని పూర్తిగా కల్పించలేదు. గత మూడు సంవత్సరాలుగా పని దినాలు గణనీయంగా తగ్గిపోయాయి. 2009-10 సంవత్సరంలో దేశ వ్యాపితంగా 283కోట్ల పనిదినాలు లభిస్తే, 2010-11 సంవత్సరంలో 257కోట్ల పని దినాలు మాత్రమే కల్పించబడ్డాయి. ఇది, అంతకు ముందు సంవత్సరం కన్నా 9.2 శాతం తక్కువ. అదే సమయంలో పనికోసం దరఖాస్తు చేసుకొన్న కుటుంబాలు 28లక్షలు పెరిగాయి. సగటు పని దినాల సంఖ్య 54శాతం నుండి 47 శాతానికి పడిపోయింది. 2009-11 సంవత్సరాల మధ్య 100రోజులు పని పొందిన కుటుంబాల సంఖ్య 70లక్షల నుండి 55లక్షలకు పడిపోయింది.

### 'ఉపాధి పనుల ఎడల విముఖత?!'

ఉపాధి హామీ పథకం పట్ల వ్యవసాయ కూలీలలో క్రమంగా విముఖత ఏర్పడుతున్నదని ప్రచారం సాగుతున్నది. 2009-10 ఏడాదితో పోల్చుకుంటే 2010-11లో 12 రాష్ట్రాల్లో ఈ చట్టం క్రింద పనికోసం డిమాండు తగ్గిందని గ్రామీణాభివృద్ధిశాఖ చెబుతున్నది. ఈ ఏడాది మంచి వర్షాలు పడటంతో సాగుపనులు ఎక్కువగా వుండి ఉపాధి పనులకు డిమాండు తగ్గిందని కూడా వివరించింది. అదే సమయంలో హామీ పథకం పనుల వల్ల రైతులకు కూలీల కొరత ఏర్పడుతున్నదని, అందువల్ల సాగు పనులకు హామీ పథకాన్ని అమలు చేయాలన్న డిమాండు ముందుకు తెస్తున్నారు. ఉపాధి హామీ పథకం పట్ల కూలీలలకు విముఖత పెరిగితే వ్యవసాయానికి కూలీల కొరత ఉండరాదు. కాగా వ్యవసాయ పనులు సాగేటప్పుడు హామీ పథకం పనులు చేపట్టరాదని గత ఏడాది కేంద్రం స్పష్టం చేసింది. పరస్పర విరుద్ధమైన ఈ వాదనలు రైతాంగాన్ని తప్పుదారి పట్టించడానికుద్దేశించినవన్నది స్పష్టం.

ఆంధ్రప్రదేశ్‌లోని ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో రోజంతా చాకిరీ చేసినా 40, 50 రూ॥లు మించి రావటం లేదని కూలీలు వాపోతున్నారు. కనీస వేతన చట్టాలను ఉపాధి హామీ పథకానికి వర్తింపచేయాలన్న డిమాండు దేశవ్యాపితంగా వచ్చింది. ఆ మేరకు ఉపాధి హామీ పథకాలలో వేతనాలు పెంచుతామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ యిది అమలు జరిగింది లేదు.

పని కోరుతూ దరఖాస్తు చేసుకున్న 15 రోజుల లోపల ఉపాధి హామీ పథకం కార్డు వున్నవారికి పని చూపలేకపోతే, వారికి నిరుద్యోగ భృతి ఇవ్వాలన్న నిబంధన వుంది. అయితే దీనికయ్యే ఖర్చు మొత్తాన్ని రాష్ట్రప్రభుత్వం తన నిధులనుండే భరించాలి. కేంద్రం నుండి వచ్చిన నిధులనే పూర్తిగా ఖర్చు చేయని రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ భృతి చెల్లించకుండా వుండటానికి పనికోరుతూ వచ్చిన దరఖాస్తులను తిరస్కరించటమో, నమోదు చేయకపోవటమో జరుగుతున్నది. హామీ పథకంపై పార్లమెంటు స్థాయీ సంఘం-నిరుద్యోగ భృతి చెల్లింపు నిబంధన అమలులో రాష్ట్రాలు విఫలమైనందున కేంద్రమే దానిని చేపట్టాలని సూచించింది. పని కావాలన్న డిమాండునుబట్టి పని కల్పించటానికి వీలుగా చట్టాన్ని సవరించాలని కూడా సూచించింది. నిరుద్యోగభృతి కోరుతూ పెట్టుకున్న దరఖాస్తులు చెల్లింపులు లేకుండా ఉండిపోతున్నాయని కూడా పేర్కొంది. ఒరిస్సాలో 50వేల నిరుద్యోగ భృతి దరఖాస్తులు ఏడాది నుండి చెల్లింపులపై నిర్ణయం కోసం ఫైళ్లలో పడివున్నాయనీ, ఇది ఒరిస్సా ఒక్కదానికే పరిమితం కాదనీ, అన్ని రాష్ట్రాల్లోనూ పరిస్థితి ఇలాగే వున్నదని కూడా వ్యాఖ్యానించింది. (ఇండియన్ ఎక్స్‌ప్రెస్ 19.9.2011). కనుక రాష్ట్రాలు నిరుద్యోగభృతిని చెల్లించకుండా, తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు హామీ పనులపట్ల కూలీలలో విముఖత ఏర్పడిందన్న ప్రచారాన్ని సాగిస్తున్నాయి. అలాగే వేతనాల చెల్లింపులో అనేక వ్యత్యాసాలున్నట్లు స్థాయీ సంఘం కనుగొన్నది. మరో మాటల్లో చెప్పాలంటే కనీస వేతనాల చెల్లింపు సజావుగా లేదని అంగీకరించింది. ప్రతి డిమాండును నమోదుచేసి, వారికి పని కల్పించితే ఈ పథకపు వ్యయం లక్షకోట్ల రూపాయలకు చేరుతుందని గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి జైరామ్ రమేష్ అంగీకరించాడు.

### 'కూలీల కొరత'-వాస్తవాలు

తూర్పు గోదావరి జిల్లాలో మొత్తం వ్యవసాయ కూలీల సంఖ్య సుమారు 7.5 లక్షలు. 2010-11లో ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొన్న కూలీలు 5.2 లక్షలు. సగటున వీరు పనిచేసినది 37 రోజులు. కుటుంబానికి వంద రోజులు పని కల్పించాల్సిన దానిలో మూడవ వంతు మాత్రమే కూలీల కుటుంబాలకు పని కల్పించబడింది. వంద రోజులు పనులు కల్పించబడిన కుటుంబాలు 25 వేలు. అంటే 5శాతం కుటుంబాలు కూడా లేవు. ఆగస్టు నుండి మార్చి వరకు వ్యవసాయ పనులుంటాయి. ఈ కాలంలో ఉపాధి హామీ కింద పని కల్పించిన పనిరోజులు 10 శాతం మాత్రమే. ఈ పనుల్లో పాల్గొన్న కూలీల సంఖ్య 60 వేలకు దాటలేదు. జనవరి నెలలో 9 వేలమంది మాత్రమే ఈ పనుల్లో పాల్గొన్నారు. గత సంవత్సరం పని చేసిన వారిలో పది శాతం కూడా లేరు. దీన్నిబట్టి 90శాతం మంది కూలీలు, 90 శాతంపైగా వ్యవసాయ పనులే చేశారు. ఈ జిల్లాలో ఒక సర్వే ప్రకారం 20 కోట్ల పని దినాలు కల్పించబడితే,

(తరువాయి 2వ పేజీలో)

సంపాదకీయం

## పరమకుడిలో దళితులపై పోలీసుల పాశవిక హత్యాకాండ

**తమిళనాడు** రాష్ట్రం-రామానంతపురం జిల్లా-పరమకుడివద్ద, శాంతి భద్రతల పరిరక్షణ పేరుతో పోలీసులు జరిపిన కాల్పులలో 7గురు దళితులు మరణించారు. ఈ హత్యాకాండ కొనసాగింపుగా, పోలీసులు మదురై జిల్లా చింతామణి ప్రాంతంలో దళితులపై కాల్పులలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

మొత్తంగా ఈ పోలీసు కాల్పుల ఘటనలలో దాదాపు వందమంది దళితులు తీవ్రంగా గాయపడ్డారు. పరమకుడిలో ప్రతిఏటా నిర్వహించే ఇమ్మాన్యువల్ శేఖరన్ అనే దళిత నాయకుని జయంతి సందర్భంగా సంస్మరణ ఉత్సవానికి హాజరయ్యేందుకు వస్తున్న జాన్‌పాండియన్ అనే దళితనాయకుడిని, తుత్తుకుడిజిల్లా వల్లనాడువద్ద పోలీసులు అరెస్టు చేసి రామానంతపురం జిల్లాలోకి ప్రవేశించనీయకుండా అడ్డుకోవటాన్ని నిరసిస్తూ పెద్దఎత్తున నిరసనకు పూనుకున్న దళితులపై పోలీసులు కాల్పులు సాగించారు. పోలీసు కాల్పులలో మరణించిన లేదా గాయపడిన దళితులందరూ నిరాయుధంగావున్నవారే. పోలీసు కాల్పులలో మరణించినవారు లేదా తీవ్రంగా గాయపడిన వారంతా 'గురుపూజ' కార్యక్రమంలో పాల్గొన్న వారుకానీ, ప్రేక్షకులలో ఉన్న వారుగా గానీ వున్నారు.

ఈ విధంగా, వలసపాలకుల అడుగుజాడల్లో సాగుతున్న మన 'ప్రజాస్వామ్య' పాలకులు, అణచివేయబడుతున్న ప్రజల యొక్క చిన్నపాటి నిరసనలను సైతం ఏ విధంగా పాశవికంగా గొంతునులిమివేస్తూ తమ పాలనను సాగిస్తున్నారో మరోసారి స్పష్టమైంది.

తమిళనాడులో పెరియార్ రామస్వామి నాయకత్వంలో బ్రాహ్మణీయవ్యతిరేక ఉద్యమం ఒకనాడు పెద్దఎత్తున నిర్వహింపబడింది. గత నాలుగున్నర దశాబ్దాల కాలంలో తమిళనాడు రాష్ట్రం ఏదో ఒక రూపంలో బ్రాహ్మణీయవ్యతిరేక రాజకీయ పార్టీల పాలనలో వుంటూ వచ్చింది. కానీ, రాష్ట్రంలో దళితులపై తీవ్రమైన కుల అణచివేత, కులోన్మాదదాడులు మాత్రం కొనసాగుతూవుండటమేగాక, బాగా విస్తరించాయి.

దళిత నాయకుడు ఇమ్మాన్యువల్ శేఖరన్‌కు 'గురుపూజ'ను నిర్వహించటం ఇదే తొలిసారి కాదు. 54 సం॥ క్రితం హత్యకుగురైన ఈ తమ దళిత నాయకుడిని గత అనేక సంవత్సరాలుగా తమిళనాడులో దళితులు సంస్మరించుకుంటూనే వస్తున్నారు. ఆర్థికంగా పటిష్టంగావుండి, అధికారంలోనున్న పాలకపార్టీతో రాజకీయంగా గట్టి బంధాన్ని కలిగివున్న ఆధునిక సంపన్న మధ్యంతర కులాల నాయకులు నిర్వహించే 'గురుపూజ'లతో సరి సమాన స్థాయిలో-సమాజంలో అత్యంత దిగువ తరగతికి చెందిన దళితులు గురుపూజలు నిర్వహించటాన్ని వారు సహించలేకపోతున్నారు.

రాష్ట్రంలో-ఏ పార్టీ అధికారంలోనున్నప్పటికీ-తమ 'మిత్ర'కులాలు ఆర్భాటంగానూ, అధికారవైభోగపేతంగానూ గురుపూజలను నిర్వహించేందుకు ఏ విధమైన ఆటంకాలూ కల్పించకుండా తమ పూర్తి మద్దతునందిస్తున్నాయనేది గుర్తించవలసిన ముఖ్యమైనవిషయం. అదే, దళితుల 'గురుపూజ'ల నిర్వహణ దగ్గర కొచ్చేసరికి ప్రభుత్వం అనేక రకాల ఆంక్షలు-నిషేధాలు విధిస్తున్నది. జయలలిత నాయకత్వంలోని తమిళనాడు రాష్ట్రప్రభుత్వం కూడా ప్రస్తుత సందర్భంలో అదే వైఖరి తీసుకొని, శాంతి భద్రతలను పరిరక్షించేపేరిట, సమాజంలో శాంతి భద్రతలు దళితుల మూలంగానే విచ్ఛిన్నమౌతున్నాయన్నట్లుగా పరమకుడి దళితుల 'గురుపూజ' నిర్వహణపై నిషేదాజ్ఞలు విధించింది.

ఈ విధంగా, రాజ్యాంగం ద్వారా దళితులకు గ్యారెంటీ చేయబడిన హక్కులను సైతం అణచి వేయటంద్వారా, వారిని ప్రభుత్వమే ఆందోళనలకు రెచ్చగొట్టి, అక్రమంగా నిర్బంధించిన తమ నాయకుల విడుదలకై పోలీసులతో వారు తలపడే వైపుగా నెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ రెచ్చగొట్టే వైఖరిని కప్పిపుచ్చుతూ, నిషేధాజ్ఞలను ఉల్లంఘించి దళితులే హింసాకాండకు పాల్పడ్డారంటూ, వారినే దోషులుగా నైపుణ్యయుతంగా చిత్రించి, ప్రచారం చేశారు.

ఈ సందర్భంగా తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత-దళితులవలెనే ఒకనాడు అణచివేతకు గురైన థేవార్లతో (ఈనాటికి భూములను సంపాదించి, ఆర్థికంగా ధనిక కులంగా వున్నవారితో) రాజకీయ ప్రయోజనాలు, ఓట్ల ప్రయోజనాలను దృష్టిలో వుంచుకొని, తన అనుయాయి శశికళద్వారా మిత్రత్వం నెరపటమూ; థేవార్లయొక్క విశ్వాసాలను సంతృప్తి పరిచేందుకు పోలీసు బలగాలనుపయోగించి పరమకుడి దళితులపై రాష్ట్రప్రభుత్వం బలాన్ని ప్రయోగించిందనే వాస్తవాలను మనం జ్ఞాపకం వుంచుకోవాలి.

(తరువాయి 2వ పేజీలో)

**గ్రామీణ ...** (మొదటి పేజీ తరువాయి)

ఉపాధి పథకం క్రింద కోటి పనిదినాలు మాత్రమే కల్పించబడ్డాయి. అంటే పథకం కింద 5 శాతం పనులు కూడా కల్పించబడలేదు. ఈ ఐదు శాతంతో కూలీల కొరత ఎలా ఏర్పడుతుంది? గుంటూరు జిల్లాలోని వేమూరు మండలం కాకర్లమూడి, చదలవాడ, కుచ్చెళ్లపాడు, కొల్లూరు మండలం క్రాప, ముసలిపాడు, కొల్లిపర మండలం చక్రాయపాలెం, జెముడుబాడు, దావులూరు తదితర గ్రామాల్లో ఆగస్టు మొదటి వారం చివరిలో నాట్లు ప్రారంభమైనాయి. కృష్ణాజిల్లా అవనిగడ్డ, ఇంకా ఇతర ప్రాంతాల నుండి ఈ గ్రామాలకు పనులకోసం పెద్దఎత్తున వలస వచ్చారు. పనులకు కూలీల సమస్యే ఉత్పన్నం కాలేదు. గత సంవత్సరం కన్నా చాలా త్వరగా నాట్ల సీజన్ పూర్తి అయ్యింది. ఉపాధి పనులకే కూలీలు ఎక్కువగా పోతే ఇంత మంది కూలీలు ఎలా వలస వస్తారు? ప్రతి వ్యవసాయ సీజన్‌లోనూ నాలుగైదు రోజులు కూలీలకు ఎద్దడి ఉంటుంది. అప్పుడు అవసరాన్నిబట్టి రైతులే కూలి పెంచటం జరుగుతుంది. అందుకు ఒకేసారి ఎక్కువగా పనులు రావటమే కారణం. ఇది ఉపాధి పథకం పనులు అమలులోకి రాకముందు నుండీ ఉన్నదే. అందువలన వ్యవసాయ పనులకు కూలీల కొరత ఏర్పడిందనే ప్రచారం వాస్తవం కాదు.

## ఖర్చుకాని నిధులు

రాష్ట్రంలో ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకం క్రింద పనులకోసం 15,610 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని చెప్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం లోనూ దాదాపు 11,336 కోట్లు నిధులు ఉపయోగించుకోవటానికి అవకాశం ఉందటున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 5,383 కోట్లు మంజూరు కాగా 3,664 కోట్లు ఖర్చుకాకుండా మిగిలిపోయాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 8,272 కోట్లకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇందులో కేంద్రం వాటా 7,941 కోట్లు కాగా మిగిలినది రాష్ట్ర ప్రభుత్వం భరించాలి. ఈ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 18 వందల కోట్లు మాత్రమే ఖర్చుచేసింది. ఇదే సందర్భంలో సామాగ్రి కోసం 2009-10లో 585.01 కోట్లు ఖర్చు చేయగా, 2010-11లో 1,661.21కోట్లు ఖర్చు చేసింది. నిర్వహణ ఖర్చులు ఈ బడ్జెట్ సంవత్సరంలో 199.06నుండి 427.60 కోట్లకు పెరిగింది. నిర్వహణ, సామాగ్రి కోసం నిధులు ఎక్కువ ఖర్చు చేసినా పనిచేసే కూలీలకు మాత్రం పరికరాలు అందచేయటంలోనూ, సదుపాయాలు కలుగచేయటంలోనూ లోప భూయిష్టంగా ఉన్నాయి. వీటితో అధికారులు జేబులు నింపుకొంటున్నారు. ఎక్కువ పనులు కల్పించటానికి నిధులున్నా ప్రభుత్వం పనులు కల్పించటంలో వైఫల్యం చెందింది.

## అవినీతి మయంగా మారిన పథకం

రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల్లో మొదటి నుండి అవినీతి, అవకతవకలు జరుగుతూనే ఉన్నాయి. వీటిపై వస్తున్న విమర్శలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవటంలేదు. పథకం నిబంధనల ప్రకారం పనుల ఎంపిక పంచాయితీలకే ఉంది. పంచాయితీ, గ్రామ వార్డు సభల్లోనే ఎంపిక జరగాలి. చట్టంలోని సెక్షన్ 16 ఈ అంశాన్నే స్పష్టంచేస్తున్నది. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి తెలియంది కాదు. అయినా గ్రామసభల్ని దాదాపు పక్కన పెడుతున్నది. పంచాయితీ, మండల, జిల్లా పరిషత్‌లు 75-15-10 దామాషాలో ఎంపిక చేసిన పనులు చేయవచ్చునని 2006లో ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2009లో ఈ ఉత్తర్వులను కూడా తుంగలో తొక్కింది. పంచాయితీలతో ప్రమేయం లేకుండా మండల, జిల్లా పరిషత్‌లు గ్రామీణ లింక్ రోడ్ల పనులను ఎంపిక చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీన్ని అవకాశంగా తీసుకొని అధికార పార్టీ నేతలు క్వారీల, చేపల చెరువులకు వెళ్లే రహదారులకు నిధులు మంజూరు చేయించు కొన్నారు. ఇందులో మంత్రుల పాత్ర ఉంది. ఇందుకోసం 1800కోట్లు కేటాయించారు.

వివిధ రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో గ్రామీణ ఉపాధి పథకం అమలులో అవకతవకలు జరిగినట్లు పనులు పరిశీలించిన గ్రామీణాభివృద్ధి అధికారులు, కేంద్ర ఉపాధి హామీ మండలి, జాతీయ స్థాయి పర్యవేక్షకులు వెల్లడించారు. ఆంధ్రరాష్ట్రంలో లింక్ రోడ్లు ఇతర పనుల్లో అవకతవకలు జరిగినట్లు వెల్లడించారు. ఉపాధి హామీ పథకం పనుల్లో 100కోట్లకుపైగా అవినీతి జరిగినట్లు రాష్ట్ర పర్యవేక్షక కమిటీ గుర్తించినట్లు పేర్కొంది. ఇప్పటి వరకు 22కోట్లు రాబట్టినట్లు ప్రకటించింది. అధికారుల అవినీతిని తక్కువ చూపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. మహబూబ్‌నగర్, నల్గొండ, అనంతపురం, గుంటూరు జిల్లాల్లో, జరిగిన అవినీతి కన్నా తక్కువ చూపెట్టినట్లు ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. కొన్ని జిల్లాల్లో వచ్చిన అవినీతిఆరోపణల మొత్తం కన్నా, అందుకు తనిఖీకి వచ్చిన బృందాల వ్యయమే ఎక్కువగా ఉంది. పశ్చిమ గోదావరి జిల్లాలో కోటి ఇరవై లక్షల మేర అవినీతి జరిగినట్లు ఆరోపణలు వస్తే, దాన్ని తనిఖీ చేసిన సామాజిక బృందాల ఖర్చు 2.5 కోట్లు అయినట్లు రికార్డులు తెలియచేస్తున్నాయి. దీన్ని గమనిస్తే ఈ బృందాలూ అవకతవకలకు మినహాయింపు కాదని అర్ధమౌతున్నది. అవినీతి ఆరోపణల్లో పైస్థాయి అధికారులు తప్పించుకొంటూ, క్రింద స్థాయి ఉద్యోగులను బలిపెడుతున్నారు. ఈ విధంగా పథకం అవినీతిమయంగా మారింది.

## శ్రమశక్తి సంఘాల ఏర్పాటు

వేతనాలు చాలా ఆలస్యంగా చెల్లించటంతో హామీ పనులకు రావటానికి కూలీలు యిష్టపడటం లేదని మరో విమర్శ వుంది. చట్టంపై సరైన అవగాహన లేనందున కూలీలు పథకంతో సహకరించటం లేదన్నది మరో వాదన. దీనికి జైరామ్‌రమేష్ చూపిన పరిష్కారం వ్యాపార ఏజంట్ల (బిజినెస్ కరస్పాండెంట్లు) నియామకం. అంటే ప్రభుత్వ యంత్రాంగం చేయవలసిన పనిని ప్రైవేటీ కరించటమే. కూలీలకు పథకం పట్ల అవగాహన కల్పించేందుకూ, కూలీలకూ, ప్రభుత్వ యంత్రాంగానికీ మధ్యన మధ్యవర్తులుగా వ్యవహారాలు నడిపించేవారుగా వ్యాపార ఏజంట్లను నియమిస్తారు. కూలీలతో మొదట శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేస్తారు. వీటిని పటిష్టపరచి ప్రభుత్వ పథకపు పని వీరికి యిప్పించి, వారి వేతనాలు యిచ్చే వ్యాపార ఏజంట్లను నియమిస్తారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం 321 ఎన్‌జీవోలతో ఒప్పందం చేసుకుంది. 22 జిల్లాలోని 703 మండలాల్లో 4,73,000 శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేసినట్లు, వీటి బాధ్యత ఎన్‌జివోలకు అప్పగించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇది ఉపాధి హామీ పథకాన్ని ప్రైవేటీకరించటమే.

ప్రభుత్వ దారిద్ర్య నిర్మూలనా పథకాలకు కేటాయిస్తున్న నిధులలో 85 శాతం మధ్య దళారులకు పోయి 15 శాతమే ప్రజలకు చేరుతున్నదని రాజీవ్‌గాంధీ అన్నట్లు తరచుగా పేర్కొంటుంటారు. వాస్తవానికి ఆయన ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఐదు సూపర్ మినిస్ట్రీలలో ఒకటైన మానవ వనరుల శాఖకు మంత్రిగా పి.వి. నరసింహారావు రూపొందించిన ఒక విధాన పత్రంలో దీనిని పేర్కొన్నారు. (నూతన విద్యా విధానాన్ని రూపొందించి. ఈ ప్రతంలోనే). ప్రభుత్వ పథకాల నిధులు అవినీతిలో కూరుకుపోతున్నాయి గనుక ఈ నిధులలో సగం ఎన్‌జీవోలకు కేటాయిస్తే అవినీతి తగ్గుతుందని పి.వి.నరసింహారావు సూచించారు. ప్రభుత్వ యంత్రాంగం ద్వారా అమలులో 15 శాతమూ, ఎన్‌జీవోల ద్వారా అమలులో 50 శాతమే ప్రజలకు చేరి మొత్తంగా 65 శాతం నిధులు ప్రజలకు చేరి దారిద్ర్యం తగ్గుతుందని ఆయన అంచనా. ఆ తర్వాతే భారత్‌లో ఎన్‌జీవోలు తామర తంపరగా పుట్టుకొచ్చాయి.

పథకాల నిధులతో పేదవర్గాలలో నోరుగల వ్యక్తులను ఆకట్టుకుని వారి ద్వారా పేద ప్రజలను రాజకీయంగా ప్రభావితం చేసే విధానాన్ని అనుసరిస్తూ వచ్చిన పాలకులు, ఎన్‌జీవోలను రంగప్రవేశం చేయించి, వాటి ద్వారా ప్రజలను తమ కట్టడిలో వుంచే విధానాన్ని తెచ్చేందుకు కావాల్సిన భూమికను పి.వి.నరసింహారావు విధాన పత్రం రూపొందించింది. ఈ విధానం తమ స్వేచ్ఛను హరిస్తుందంటూ మొదట్లో గగ్గోలు పెట్టిన ఎన్‌జివో సంస్థలు పి.వి.నరసింహారావుతో చర్చించిన తర్వాత అంగీకరించాయి. దీనితో ప్రభుత్వం దారిద్ర్య నిర్మూలనా పథకాలని పిలుస్తున్న వాటికి కేటాయిస్తున్న నిధులలో కొంతభాగాన్ని ఎన్‌జీవోల ద్వారా ఖర్చు చేయటం మొదలుపెట్టింది. దీనిలో భాగంగా ప్రభుత్వం మొదలుపెట్టిన డ్వాక్రా గ్రూపులతో సూక్ష్మరుణ సంస్థల ప్రవేశానికి కావాల్సిన వాతావరణాన్ని కల్పించింది. ఈ సూక్ష్మరుణ సంస్థలు మహిళల రక్తమాంసాలను పిండి పీల్చివేశాయనేది అందరికీ తెలిసినదే. ప్రభుత్వమే నిర్వహించిన పథకాలు దారిద్ర్యాన్ని ఎలా నిర్మూలించలేక పోయాయో, ఎన్‌జీవోల ద్వారా నిర్వహించిన పథకాలు కూడా అలాగే దారిద్ర్యాన్ని నిర్మూలించలేక పోయాయి. వాస్తవానికి దారిద్ర్యం మరింతగా పెరిగిపోయింది.

ఈ నేపథ్యంలో చూసినట్లయితే బిజినెస్ కరస్పాండెంట్లన్న ముద్దు పేరుతో గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఎన్‌జీవోలకు అప్పగించటం ద్వారా ప్రైవేటీకరించడానికి పూనుకున్నారని అర్ధమౌతుంది. ఆ విధంగా ప్రజల జీవనాన్ని, వారి అభిప్రాయాలను నిర్దేశించి తమ దోపిడీ వర్గ పాలనను నల్లేరు పై బండిలా నడుపుకునేందుకు పూనుకున్నారనీ అర్ధమౌతుంది.

## వందరోజుల పనితో పేదరికం పోతుందా?

గ్రామీణ ఉపాధి చట్టం క్రింద ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించటంలో ప్రభుత్వం విఫలమైంది. ఒకవేళ వందరోజుల పని కల్పించినా పేదరికం ఎలాపోతుంది? అలా చెప్పటమంటే పేదరిక సమస్యను ప్రక్కదారి పట్టించటమే. రాష్ట్రంలో వ్యవసాయం ద్వారా 250కోట్ల పని దినాలు కల్పించబడితే, ఉపాధి పథకం ద్వారా 25కోట్ల పనిదినాలు మాత్రమే కల్పించబడ్డాయి. ప్రతి కుటుంబానికి వందరోజుల పని కల్పించినా దాని ద్వారా కుటుంబానికి వచ్చే ఆదాయం 10వేలు మాత్రమే. వ్యవసాయ పనుల ద్వారా మరో 15వేలు వచ్చినా కుటుంబానికి వచ్చే ఆదాయం 25వేలు మాత్రమే. నామమాత్రమైన అవసరాలు తీర్చు కోవటానికైనా వ్యవసాయ కూలీ కుటుంబానికి కనీసం నెలకు 3వేలకుపైగానే ఖర్చు అవుతుంది. కాగా, పైన చెప్పిన విధంగా ఆదాయం సమకూరినా అది, 8 నెలలకు మాత్రమే సరిపోతుంది. మిగతా నాలుగు నెలలు వారు ఎలా బ్రతకాలి?. అనారోగ్యం మరియు అనుకోని అవసరాలు ఏర్పడి నప్పుడు అదనపు ఖర్చులు ఉంటాయి. ఇందుకోసం వారు అప్పులు చేయక తప్పదు. అందువలన వారు పేదరికంతో, అప్పుల్లోనే బ్రతకాల్సి వస్తుంది. కనుక గ్రామీణ ఉపాధి పథకం గాని, మరే పథకాలు గానీ పేదల పేదరికాన్ని తొలగించలేవు. ఇవన్నీ పేదలను వంచించటానికి, ప్రభుత్వం ఎడల భ్రమలు కల్పించి దాని చుట్టూ తిప్పుకోవటానికీ ఉద్దేశించినవే. పేదరికం, భూమి సమస్యతో ముడిపడి ఉంది. వ్యవసాయ భూమిపై వారికి హక్కు ఏర్పడినప్పుడే పేదరికం నుండి బయటపడ గలుగుతారు.

దాన్ని సాధించుకొనే క్రమంలో గ్రామీణ ఉపాధి పథకం పనులతోపాటు సంవత్సరం పొడవునా పనులు కల్పించాలని ఆందోళన చేస్తూనే, విప్లవ భూసంస్కరణల ద్వారా పేదలు భూములు సాధించు కోవాలి.గ్రామీణ పేదలందరూ అందుకు వ్యవసాయక విప్లవ మార్గం చేపట్టాలి. D

**పరమకుడిలో...** (మొదటి పేజీ తరువాయి)

పరమకుడివద్ద దళితులపై పోలీసుల పాశవిక కాల్పులకు దారితీయటానికి ఉపరితల, తక్షణ కారణంగా ఇది కనబడుతున్నప్పటికీ, ఫ్యూడల్ కాలం నుండీ తమిళనాడులో మార్పులేకుండా కొనసాగుతున్న కుల అణచివేత, కులతత్వ ఆచరణలే వీటికి మూలమైన ప్రాథమిక కారణామనే అంశాన్ని మరువరాదు.

1996-97 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వ మానవాభివృద్ధి మంత్రిత్వ శాఖ సమర్పించిన వార్షిక నివేదికననుసరించి, తమిళనాడులో కుల కొట్లాటలు పెరుగుతూ వస్తున్నాయి. ప్రత్యేకించి ఈ కుల ఘర్షణలు దళితులకు మరియు మధ్యంతర వెనుకబడిన కులాలైన థేవార్లు, నాడార్లు, వన్నియార్ల నడుమ చోటు చేసుకుంటున్నాయి. తమిళనాడులోని కుల ఘర్షణలకు సంబంధించిన ఈ నిర్దుష్ట పరిణామాన్ని పరిశీలిస్తే, దీనికి వెనుకనున్న కారణాన్ని తేలిగ్గానే గ్రహించవచ్చు.

రాష్ట్రంలో దళితులకు అత్యధిక రిజర్వేషన్లు, వారి అభ్యున్నతికి సామాజిక సంక్షేమ పథకాలు ఎన్నివున్నాయంటున్నా ఈ రోజుకీ తమిళనాడులోని దళితులు భూమిహీన వ్యవసాయ కూలీ వర్గంగా వున్నారు. థేవార్లు, వన్నియార్లు, నాడార్లు వంటి ఆర్థికంగా వెనుకబడిన కులాలు, తమిళనాడులో సంభవించిన బ్రాహ్మణీయ వ్యతిరేక ఉద్యమం నుండి జాగృతి పొందినవారుగా, స్వంతగా భూమిని పొందిన కులాలుగా పరిణామం చెందాయి. ఆ విధంగా వారు పాలక పార్టీలతో మైత్రి నెరుపుతూ సమాజంలో ఆధిపత్య కులాలుగా పరిణామం చెందారు. భూమిని కలిగివున్న కులాలుగా వారి హోదాలో వచ్చిన ఈ మార్పుతో, వారుకూడా భూమిని కలిగివున్న హోదాతో సంక్రమించే ఫ్యూడల్ స్వభావాన్ని సంతరించుకున్నారు. ఆ విధంగా ఫ్యూడల్ భావజాలానికి చెందిన బ్రాహ్మణీయ అగ్రకుల సంస్కృతితో తమిళనాడులో కానీ, మరెక్కడైనా కానీ, కుల అణచివేతకు, దళితులపై అవమానకరమైన కుల అణచివేత దాడులకు భూమి సంబంధాలే నిర్ణయాత్మకమైనవిగా వున్నాయి.

అర్ధఫ్యూడల్ వ్యవస్థగా వున్న మన సామాజిక ఆర్థిక వ్యవస్థ స్వభావంలో మౌలిక మార్పు లేకపోయిన ఫలితంగా కుల అణచివేత, అస్పృశ్యత, దళితుల పట్ల వివక్షత, చిన్నచూపు వంటి సామాజిక రుగ్మతలన్నీ కొనసాగుతూ రోజురోజుకీ తీవ్రమౌతున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వ పాలన ఉత్తరప్రదేశ్‌లోలాగా దళితమహిళ చేతిలో వున్నప్పటికీ, తమిళనాడులోవలె బ్రాహ్మణేతరుల చేతిలో వున్నప్పటికీ, ఈ పరిస్థితులలో మార్పులేమీ లేవనేది స్పష్టమౌతున్నది. తమిళనాడులో కానీ, లేదా భారతదేశంలో మరే రాష్ట్రంలో కానీ కుల అణచివేతకు, దళితులపై కులపరమైన దాడుల సంఘటనలకు-మార్పులేని స్థిరమైన భూ సంబంధాలు మరియు భూమిని పొందివుండటమనేవే కారణాలుగా వున్నాయనేది స్పష్టమే. మన దేశంలో కుల అణచివేత ఉనికిలో ఉండటానికి ఇదే మౌలిక కారణంగావుంది.

మన సమాజంలో విస్తరించివున్న కుల వివక్షకు వ్యతిరేకంగా మనం పోరాడాలంటే, భూమి సంబంధాలపైన; భూమిని కలిగి వుండటమనేది ప్రజల సాంస్కృతిక, సామాజిక ఆచరణలను నిర్ణయించేదిగా వుండటంపైన ఆధారపడిన సామాజిక – ఆర్థిక వ్యవస్థలను కూలద్రోసే దిశగా మన పోరాటాన్ని ఎక్కుపెట్టితీరాలి. వర్గదృక్పథంతో ఈ విధమైన పోరాటాన్ని నడపటం ద్వారా మాత్రమే కులనిర్మూలనా పోరాటాలు ఫలవంతమౌతాయి.

పరమకుడి దళితులపై పోలీసుల పాశవిక హత్యాకాండను 'జనశక్తి' తీవ్రంగా ఖండిస్తున్నది. అణచివేతకు గురవుతున్న దళితులు సాగిస్తున్న ఆందోళనకు పూర్తి సంఘీభావాన్ని ప్రకటిస్తున్నది. D

సిపిఐ (ఎం-ఎల్) ప్రచురణ
**విప్లవ ప్రజా ఉద్యమం**
**విప్లవ ప్రజా ఉద్యమ సమస్యలు**
**సావధానంగా చర్చిద్దాం!**
కామ్రేడ్ విశ్వం వ్యాస సంకలనం
వెల: 10.00
కాపీలకు:
మైత్రీ బుక్ హౌస్
జలీల్ వీధి, అరండల్‌పేట,
విజయవాడ

సిపిఐ (ఎం-ఎల్) ప్రచురణ
**ఆంధ్రప్రదేశ్ విభజన**
**కమ్యూనిస్టు విప్లవకారుల వైఖరి**
కామ్రేడ్స్ తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి
వెంకటేశ్వరరావు, విశ్వం తదితరుల
వ్యాస సంకలనం
వెల: రు. 15/-

సిపిఐ (ఎం-ఎల్) ప్రచురణ
**విభజనవాద-సమైక్యవాద**
**మూలాలు**
**మార్క్సిస్టు పరిశీలన-కర్తవ్యాలు**
వెల: రు. 5/-
ప్రతులకు: మైత్రీ బుక్ హౌస్
జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

జనశక్తి
విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

# అధ్యయన విధానంలో సంస్కరణ

## మావో

*1941 సం॥ మే నెలలోయేనాన్‌లో పార్టీ కార్యకర్తల సమావేశంలో కామ్రేడ్ మావో సేటుంగ్ చేసిన ఉపన్యాసమిది. పార్టీలో మార్క్సిజాన్ని అధ్యయనం చేయటంలో తలెత్తుతున్న నష్టకరమైన పద్ధతులను, విధానాలను ఈ ఉపన్యాసంలో పేర్కొనటంతో పాటు, మార్క్సిజాన్ని అధ్యయనం, అన్వయం చేసే పద్ధతులను సూటిగా, స్పష్టంగా ఇందులో కా॥ మావో వివరించారు. -సంపాదకుడు*



**1**

**పార్టీ** అంతటా మన అధ్యయన విధానాన్ని, పద్ధతుల్ని, సంస్కరించుకోవాలని నేను ప్రతిపాదిస్తున్నాను. దానికి కారణాలు ఇవి :

మార్క్సిస్టు-లెనినిస్టు విశ్వజనీన సత్యాన్ని చైనా విప్లవ నిర్దిష్ట ఆచరణలో ఆనాటికానాటికి సమైక్యం చేసిన చరిత్రే చైనా కమ్యూనిస్టు పార్టీ గత ఇరవై ఏళ్ళ చరిత్ర. మన పార్టీ శైశవ దశలో మార్క్సిజం-లెనినిజం గురించి, చైనా విప్లవం గురించి మనకున్న అవగాహన ఎంత తక్కువో, ఎంత మిడిమిడి జ్ఞానమో ఒక్కసారి గుర్తుకు తెచ్చుకుంటే, అది ఇప్పుడెంత లోలోతులకు పోతూ వృద్ధి చెందుతుందో చూడగలం. గత వంద సంవత్సరాలుగా చైనా దేశపు ఉత్తమోత్తమ పుత్రీపుత్రులు అస్తవ్యస్థమయిన దేశం బాగుకోసం పోరాడుతూ తమ ప్రాణాలను త్యాగం చేశారు. ఒకరు లేని లోటును మరొకరు తీరుస్తూ, వారు తమ దేశాన్ని, ప్రజల్ని రక్షించే, విముక్తి చేసే మార్గాన్ని అన్వేషించారు. ఇది మనకు సంతోషాన్ని, విషాదాన్ని కలిగిస్తుంది. కానీ మన జాతిని విముక్తి చేసుకోవడానికి అవసరమైన అత్యుత్తమ ఆయుధమూ, వాస్తవమూ అయిన మార్క్సిజం - లెనినిజాన్ని మొదటి ప్రపంచ యుద్ధానంతరం, రష్యా అక్టోబరు విప్లవానంతరం మాత్రవే కనుగొన్నాం. ఈ ఆయుధాన్ని ప్రయోగించడంలో చైనా కమ్యూనిస్టు పార్టీ చొరవ తీసుకొంది. ప్రచారం చేసింది. నిర్మాణం చేపట్టింది. చైనా విప్లవ నిర్దిష్ట ఆచరణతో జోడించబడిన తర్వాత, విశ్వజనీన సత్యమైన మార్క్సిజం-లెనినిజం చైనా విప్లవానికి పూర్తిగా కొత్త రూపునిచ్చింది. జపాన్ వ్యతిరేక ప్రతిఘటనా యుద్ధం ప్రారంభమైనప్పటి నుండే మన పార్టీ విశ్వజనీన సత్యమైన మార్క్సిజం-లెనినిజాన్ని పునాదిగా చేసుకుని యుద్ధంలో నిర్దిష్ట ఆచరణను అధ్యయనం చేయటంలోను, నేటి చైనాను, ప్రపంచాన్ని అధ్యయనం చేయటంలోనూ మరొక అడుగు ముందుకు వేసింది. చైనా చరిత్రని అధ్యయనం చెయ్యడం కూడా ప్రారంభించింది. ఇవన్నీ మంచి లక్షణాలు.

**2**

అయితే ఇప్పటికీ మనలో లోటుపాట్లు వున్నాయి. వాటిలో కొన్ని చాలా పెద్దవి కూడా వున్నాయి. ఈ లోటుపాట్లను సరిదిద్దకోకుండా మన పనిలో ముందడుగు వేయలేమని, విశ్వజనీన సత్యమైన మార్క్సిజం-లెనినిజాన్ని చైనా విప్లవ నిర్దిష్ట ఆచరణతో సమన్వయించడమనే మన మహత్తర కర్తవ్యాన్ని నిర్వహించలేమనీ నా అభిప్రాయం.

ముందుగా ప్రస్తుత పరిస్థితులను అధ్యయనం చేయడం తీసుకుందాం. నేటి జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల్ని అధ్యయనం చేయడంలో కొంత విజయాన్ని సాధించాం. కానీ మనంత పెద్ద రాజకీయ పార్టీ స్థాయికి మనం సేకరించిన సమాచారం అతి తక్కువే. అంతేగాక, రాజకీయ, సైనిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలన్నింటి లోనూ మనం చేసిన పరిశోధన క్రమబద్ధమైనదిగా లేదు. సాధారణంగా చెప్పుకోవాలంటే ఈ అంశాలపై విషయసేకరణలోనూ, అధ్యయనంలోనూ మనం గత ఇరవై సంవత్సరాలలోనూ, క్రమబద్ధంగా, క్షుణ్ణంగా పనిచేయలేదు. భౌతిక వాస్తవాన్ని పరిశోధించడానికి, అధ్యయనం చేయడానికి అవసరమైన వాతావరణం మనకు లేదు. "పిచ్చుకల్ని పట్టే గుడ్డివాడి"లాగ, "చేపల్నిపట్టే గుడ్డివాడి"లాగా వ్యవహరించడం, లేదా మొరటుగానూ, నిర్లక్ష్యంగానూ ఉండటం, వాగాడంబరానికి లోను కావటం, అతి తక్కువ పరిజ్ఞానంతోనే సంతృప్తిపడటం- ఇది తప్పుడు పని విధానం, మార్క్సిజం-లెనినిజం మౌలికాంశాలకు భిన్నమైన పద్ధతి. ఈ పద్ధతి ఇప్పటికీ మన పార్టీలోనూ చాలా మంది కామ్రేడ్స్‌లో వుంది. పరిస్థితుల్ని చైతన్య యుతంగా అధ్యయనం చెయ్యాలనీ, వ్యక్తిగత ఇష్టా యిష్టాలతో కాక, భౌతిక వాస్తవికతతో ముందుకు సాగాలనీ, మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లు మనకు నేర్పారు. అయితే మన కామ్రేడ్స్ చాలా మంది ఈ సత్యానికి పూర్తిగా భిన్నంగా నడుస్తున్నారు.

రెండవది, చరిత్ర అధ్యయనాన్ని తీసుకోండి. కొంత మంది పార్టీ సభ్యులు, సానుభూతిపరులు ఈ పనిలో ఉన్నప్పటికి అది ఒక క్రమపద్ధతిలో జరగడంలేదు. గత వంద సంవత్సరాల చరిత్ర కానివ్వండి, పురాతన కాలం నాటి చరిత్ర కానివ్వండి, మొత్తం మీద చైనా చరిత్ర గురించి మన పార్టీ సభ్యులు చాలా మంది ఇంకా అయోమయంలోనే వున్నారు. పురాతన గ్రీసును ఉదహరించకుండా మాట్లాడలేని మార్క్సిస్టు-లెనినిస్టు పండితులు చాలా మంది వున్నారు. కానీ మన పూర్వీకుల గురించి మాత్రం వారు పూర్తిగా మర్చిపోయారు. ప్రస్తుత పరిస్థితుల్నిగాని, మన చరిత్రనుగాని లోతుగా అధ్యయనం చేయడానికి అనుకూలమైన వాతావరణం తగినంతగా సృష్టించబడలేదు.

మూడవది, అంతర్జాతీయ విప్లవానుభవాన్ని, విశ్వజనీన సత్యమైన మార్క్సిజం-లెనినిజాన్ని అధ్యయనం చేయడం తీసుకోండి. చాలామంది కామ్రేడ్స్ మార్క్సిజం-లెనినిజాన్ని విప్లవాచరణ కోసం కాక ఉత్త విజ్ఞాన సముపార్జన కోసం మాత్రమే అధ్యయనం చేస్తున్నట్లుంది. దాని ఫలితంగా వాళ్ళు చదివినదాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. వాళ్ళు మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లను పాక్షికంగా ఉదహరించగలరే తప్ప, వారి దృక్పథాన్ని, పద్ధతిని ఆసరా చేసుకొని చైనా ప్రస్తుత పరిస్థితులను, చైనా చరిత్రను నిర్దిష్టంగా అధ్యయనం చెయ్యడానికిగాని, చైనా విప్లవ సమస్యల్ని నిర్దిష్టంగా విశ్లేషించి, పరిష్కరించ డానికిగాని అన్వయించలేరు. మార్క్సిజం- లెనినిజం పట్ల అటువంటి ధోరణి వుండటం, ముఖ్యంగా మధ్యస్థాయి, ఉన్నత స్థాయి కార్యకర్తలకు చాలా హానికరం.

నేను పైన పేర్కొన్న మూడు అంశాలు - నిర్దిష్ట పరిస్థితుల అధ్యయనాన్ని నిర్లక్ష్యం చేయడం, చరిత్ర అధ్యయనాన్ని నిర్లక్ష్యం చేయడం-ఇవన్నీ మన కార్యవిధానంలో పూర్తిశైలినే సూచిస్తున్నాయి. దీని వ్యాప్తివల్ల మన కామ్రేడ్స్‌లో చాలా మందికి హాని జరిగింది.

నిజానికి ఈ రకమైన పని విధానంవల్ల మన శ్రేణుల్లోని చాలా మంది కామ్రేడ్స్ తప్పుడు తోవలోకి పోయారు. దేశం ప్రాంతం, రాష్ట్రాలకు ఇంటా బయట నిర్దిష్టపరిస్థితుల్ని కూలంకషంగా. క్రమబద్ధంగా పరిశోధించడానికి ఇష్టపడని వాళ్ళు తమ మిడిమిడి జ్ఞానం ఆధారంగా ఆజ్ఞలు మాత్రం జారీ చేస్తారు. "నేను అనుకుంటున్నాను కాబట్టి అది అలానే అయివుంటుంది." అనుకునే స్వీయాత్మక పని విధానం మనలో చాలామంది కామ్రేడ్స్‌లో ఇప్పటికీ లేదూ?

మన చరిత్ర ఏమీ తెలియకపోవడం, లేదా అతికొద్దిగా తెలియడం మూలంగా సిగ్గుపడటానికి బదులు గర్వించేవాళ్ళు కొంతమంది వున్నారు. వాస్తవానికి చైనా కమ్యూనిస్టుపార్టీ చరిత్ర, నల్లమందు యుద్ధం నుండి వంద సంవత్సరాల ఆర్థిక, రాజకీయ, సైనిక, సాంస్కృతిక చరిత్రని అధ్యయనం చేయడాన్ని ఎవరూ తీవ్రంగా పట్టించుకోలేదు. తమ దేశం గురించి ఏమీ తెలియని వాళ్ళు విదేశాల పురాతన కథల్ని మాత్రం వల్లెవేస్తారు. కనీసం ఈ విజ్ఞానం అయినా సమగ్రంగా వుండదు. అది కూడా విదేశీ పుస్తకాల నుండి సంగ్రహించిన మిడిమిడి జ్ఞానమే.

విదేశాల నుండి తిరిగి వచ్చిన విద్యార్థులు ఈ జబ్బుతో చాలా దశాబ్దాలుగా బాధపడ్డారు. ఐరోపా, అమెరికా, జపానుల నుండి స్వదేశానికి తిరిగి వచ్చిన వాళ్ళు విదేశీ చిలక పలుకులు మాత్రమే పలుకుతారు. వాళ్ళు పాడిందే పాడే గ్రామఫోనులుగా మారిపోతారు. కొత్తవిషయాలను సృష్టించడం, తెలుసుకోవడం అనే బాధ్యతలను మర్చిపోతారు. ఈ జబ్బు కమ్యూనిస్టు పార్టీలో కూడా ప్రవేశించింది.

మనం మార్క్సిజాన్ని అధ్యయనం చేస్తున్నప్పటికీ, మనవాళ్ళు చాలామంది అనుసరిస్తున్న అధ్యయన పద్ధతి మార్క్సిజానికి పూర్తిగా విరుద్ధమైనది. మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లు మనకు అందించిన సిద్ధాంతం, ఆచరణల మధ్య ఐక్యత అనే ప్రాథమిక సూత్రాన్ని వాళ్ళు జవదాటుతూ దీనికి పూర్తిగా వ్యతిరేకమైన సిద్ధాంతాన్ని, ఆచరణనుండి విడదీసే స్వంతసూత్రాన్ని వాళ్ళు రూపొందించుకుంటున్నారు. పాఠశాలల్లోను, ఆచరణలో వున్న కార్యకర్తలకు, తత్వశాస్త్రం బోధించే ఉపాధ్యాయులు చైనా విప్లవ గతితర్కాన్ని అధ్యయనం చేయటంలో విద్యార్థులకు సలహా ఇవ్వడం లేదు. అర్థశాస్త్రం చెప్పే ఉపాధ్యాయులు, చైనా ఆర్థిక వ్యవస్థ విశిష్ట లక్షణాలను అధ్యయనం చేయటంలో వారికి సలహా ఇవ్వటంలేదు. రాజనీతి శాస్త్రం బోధించే ఉపాధ్యాయులు, వారికి చైనా విప్లవ ఎత్తుగడల్ని అధ్యయనం చేయడానికి అవసరమైన సలహాలివ్వడంలేదు. సైనిక శాస్త్రం చెప్పే అధ్యాపకులు, చైనా ప్రత్యేక లక్షణాలకు అన్వయించి వ్యూహాలు, ఎత్తుగడల గురించి అధ్యయనం చేయటంలో సలహాలివ్వడంలేదు. ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నెన్నో. తత్ఫలితంగా వ్యాపిస్తున్న తప్పుడు అభిప్రాయాలు ప్రజలకు బాగా హాని కలిగిస్తున్నాయి. యేనాన్‌లో తాను నేర్చుకున్న దానిని ఫూషన్‌లో ఎలా అన్వయించాలో తెలియని వాళ్ళున్నారు. ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్లు సరిహద్దు ప్రాంత ద్రవ్యానికి, కొమింటాంగ్ ద్రవ్యానికి మధ్య గల సంబంధాన్ని వివరించలేదు. కాబట్టి విద్యార్థులలో వికృత మనస్తత్వం సృష్టించబడింది. చైనా సమస్యలపట్ల శ్రద్ధ చూపడానికి, పార్టీ ఆదేశాలను చిత్తశుద్ధితో అమలు చేయటానికి బదులుగా వాళ్ళు తమ అధ్యాపకుల దగర నేర్చుకున్న పిడిసూత్రాలే శాశ్వతమైనవనీ, మార్చాల్సిన అవసరం లేనివని భావించి, వాటిని ఒంటిపట్టించు కుంటారు.

అయితే, ఇప్పుడు నేను చేసిన ప్రస్తావన అంతా మన పార్టీలోని అతిచెడ్డ వారిని గురించి. అంతా ఇలా వున్నారని నేనడంలేదు. కానీ ఇలాంటి వాళ్ళు కూడా ఇంకా వున్నారు. అంతకంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే, వాళ్ళుకొద్దిమందే వున్నా, వాళ్ళ మూలంగా కలిగే హాని మాత్రం చాలా ఎక్కువే. ఈ విషయాన్ని తేలికగా భావించకూడదు.

**3**

ఈ భావాన్ని మరింత వివరించటం కోసం రెండు భిన్న దృక్పథాలను పోల్చుతాను.

**మొదటిది, స్వీయాత్మక ధోరణి** : ఈ ధోరణిలో వున్న వాడు పరిసరాలను క్రమబద్ధంగాను, క్షుణ్ణంగాను అధ్యయనం చేయలేడు. అతను స్వీయాత్మకమైన ఉత్తేజంతో పనిచేస్తాడు. ఈనాటి చైనా స్వరూపాన్ని అస్పష్టంగా మాత్రమే చూడగలుగుతాడు. ఈ దృక్పథాన్ని కలిగిన వ్యక్తి చరిత్రను సమగ్రంగా అవగాహన చేసుకోలేడు. అతనికి ప్రాచీన గ్రీకుదేశం గురించి తెలుసుగాని చైనా గురించి అయోమయంగా వుంటాడు. ఈ దృక్పథాన్ని కలిగిన వ్యక్తి మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతాన్ని అవాస్తవికంగా, లక్ష్యంలేకుండా అధ్యయనం చేస్తాడు. చైనా విప్లవంలోని సైద్ధాంతిక సమస్యల్ని, ఎత్తుగడలకు సంబంధించిన సమస్యల్ని పరిష్కరించేందుకు అవసరమైన దృక్పథాన్ని, పద్ధతిని తెలుసుకోవటం కోసం కాక కేవలం సిద్ధాంత పరిజ్ఞానం కోసమే సిద్ధాంతం అన్న ధోరణిలో మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లను అధ్యయనం చేస్తాడు. అతను లక్ష్యానికి గురి చూడక బాణాలు వదులుతాడు. మనం భౌతిక వాస్తవాల మీద ఆధారపడాలని, ఆచరణలో మార్గదర్శకంగా ఉపయోగపడే సూత్రాలను వాటినుండి గ్రహించాలని మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లు మనకు ప్రబోధించారు. దానికోసం మనం మార్క్స్ చెప్పినట్లుగా వివరంగా సమాచారాన్నంతటినీ రాబట్టి, దాన్ని శాస్త్రీయ విశ్లేషణకు గురిచేయాలి. మనవాళ్ళు చాలామంది ఇలా చేయకపోగా, సరిగ్గా దీనికి భిన్నంగా ప్రవర్తిస్తారు. వాళ్ళు చాలామంది పరిశోధనలు జరుపుతున్నారు. కానీ ఈనాటి చైనా గురించికాని, గతకాలపు చైనా గురించిగాని అధ్యయనం చేయాలన్న కుతూహలం వాళ్ళకులేదు. వాస్తవంతో సంబంధంలేని, పనికిరాని 'సిద్ధాంతాల' అధ్యయనంపట్ల మాత్రం ఎక్కువ ఆసక్తి చూపుతారు. ఇంకా చాలా మంది ఆచరణ చేపడుతున్నారు. కానీ వాళ్ళు కూడా భౌతిక పరిస్థితుల అధ్యయనం పట్ల ఏ మాత్రం శ్రద్ధ చూపరు. ఈ వుత్త ఉత్సాహం మీద ఆధారపడి, సిద్ధాంతాలకి బదులు వాళ్ళ వాళ్ళ వ్యక్తిగత అనుభూతుల్ని ఏర్పరచు కొంటారు. ఈ రెండురకాలకు చెందిన వాళ్ళు కూడా స్వీయాత్మకత మీద ఆధారపడి, భౌతిక వాస్తవాల అస్తిత్వాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. వాళ్ళు-ఉపన్యాసాలను ఒకటి, రెండు, మూడు, నాలుగు అంటూ వివిధ హెడ్డింగుల క్రింద అంశాలు చెప్పుకుంటూపోతారు. వ్యాసాలు రాసేటప్పుడు అతిశయోక్తులు వాడుతారు. వాస్తవాల నుండి నిజం గ్రహించాలనే ఉద్దేశ్యం వారికిలేదు. ఏదో విధంగా నమ్మకం కలిగించి ఇతరులచేత మంచి అనిపించుకోవాలనుకుంటారు. వారు సరుకు లేకుండా పైపై మెరుగులు ప్రదర్శిస్తారు. ఏ మాత్రం గట్టితనం లేని ఓటితనానికి పోతారు. తాము ఎప్పుడూ ఒప్పులే చేస్తామంటూ. ఈ భూమిపై తమదే మొదటి శ్రేణి అధికారం అనుకుంటూ "రాచరికపు రాయబారుల"" లాగా ప్రతిచోటికీ పరుగెడుతుంటారు. మన శ్రేణుల్లోని కొంతమంది కామ్రేడ్ల పనివిధానం యిలా వుంది. ఈ రకమైన నడవడిక, ప్రవర్తనల ద్వారా తనకుతాను హాని కలిగించుకుంటాడు. ఇతరులకు దీనిని బోధించటం వల్ల వాళ్ళకి కూడా హాని కలుగుతుంది. విప్లవాన్ని నడపటంలో దాన్ని ఉపయోగించటం వల్ల విప్లవానికి హాని చేస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే, శాస్త్రీయ విజ్ఞానానికి, మార్క్సిజం, లెనినిజానికి విరుద్ధమైన ఈ స్వీయాత్మక ధోరణి కమ్యూనిస్టు పార్టీకి, శ్రామికవర్గానికి, ప్రజలకు, దేశానికి ప్రబల శత్రువు. పార్టీలోని ఈ చెడు అంతా ఈ రూపం ధరిస్తుంది. మనముందున్న శక్తివంతమైన శత్రువుపైన చావుదెబ్బ తీయాలి. స్వీయాత్మక ధోరణిని నాశనం చేయగలిగితేనే మార్క్సిజం-లెనినిజం అనే సత్యం వర్ధిల్లుతుంది. పార్టీ శక్తివంతమవుతుంది. విప్లవం విజయవంతమవుతుంది. శాస్త్రీయ దృక్పథం లేకపోవడం అంటే సిద్ధాంతాన్ని, ఆచరణను మేళవించాలనే మార్క్సిస్టు-లెనినిస్టు ధోరణిలేకపోవటం, అంటే పార్టీ ఉత్తేజం లేదని, ఉన్నా తక్కువగా ఉందని మనం భావించాలి. ఈ రకమైన వాళ్ళని వర్ణించటానికి ఒక గేయం వుంది అది : "గోడమీద పిచ్చిమొక్క-దాని తలబరువు, కాడసన్నం, వేరుశూన్యం: కొండల్లో వెదురు-మొలక-దాని నాలుక బహుపదును, చర్మం దళసరి, లోనబోలు"

శాస్త్రీయ దృక్పథం లేని వాళ్ళని; మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌ల రచనల్లోంచి వాక్యాలను అదేపనిగా ఉటంకించడం మాత్రమే చేయగలవాళ్ళని; వాస్తవ పరిజ్ఞానం లేకపోయినా అనవసరమైన ప్రతిష్టని పొందే వాళ్ళని ఈ గేయం చక్కగా వర్ణించదూ? తనలో వున్న లోపాన్ని సవరించుకోవాలని ఎవరైనా నిజంగా భావిస్తుంటే వాళ్ళు ఈ గేయాన్ని బాగా మనసుకు పట్టించుకోవాలి. లేదా మరింత ధైర్యం చూపి దాన్ని తనగది గోడకు అంటించుకోవాలని నా సలహా. మార్క్సిజం లెనినిజం ఒక శాస్త్రం. అంటే నిజాయితీతో కూడుకున్న నిర్దిష్టమైన విజ్ఞానం. దాంతో యిష్టం వచ్చినట్లుగా నాటకాలాడటానికి వీలులేదు. కాబట్టి ఈ విషయంలో మనం చిత్తశుద్ధి చూపాలి.

**రెండవది, మార్క్సిస్టు-లెనినిస్టు దృక్పథం:** ఈ దృక్పథాన్ని కలిగిన వ్యక్తి మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతాన్ని, పద్ధతిని చుట్టూ వున్న పరిస్థితుల అధ్యయనానికి, క్రమబద్ధమైన క్షుణ్ణమైన పరిశోధనకు అన్వయిస్తాడు. అతను కేవలం ఉత్సాహంతో మాత్రమే పనిచేయడు. స్టాలిన్ చెప్పినట్లు, అతడు విప్లవవూపుని ఆచరణలో మిళితం చేస్తాడు. ఈ దృక్పథం కలిగిన వ్యక్తి చరిత్రను అసమగ్రంగా చదవడు. పురాతన గ్రీకుదేశం గురించి తెలుసుకోవడం చాలదు. అతను చైనా గురించి తప్పక తెలుసుకోవాలి. విదేశాల విప్లవాల చరిత్రేగాక చైనా విప్లవ చరిత్ర కూడా తెలుసుకోవాలి. ఈ దృక్పథం కలిగిన వ్యక్తి మార్క్సిజం-లెనినిజాన్ని ఒక లక్ష్యంతో అధ్యయనం చేస్తాడు. అంటే అతని మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతాన్ని చైనా వాస్తవ విప్లవోద్యమంతో సమన్వయ పరుస్తాడు. చైనా విప్లవం ఎదుర్కొంటున్న సైద్ధాంతిక సమస్యల్ని, ఎత్తుగడలకు సంబంధించిన సమస్యల్ని ఈ సిద్ధాంత వెలుగులో పరిష్కరించబూనుకుంటాడు. ఇది లక్ష్యాన్ని గురిచూసి బాణం వేసే దృక్పథం. చైనా విప్లవం 'లక్ష్యం' అయితే, మార్క్సిజం-లెనినిజం 'బాణం' అవుతుంది. చైనా విప్లవం, తూర్పు విప్లవాలు అనే లక్ష్యాలను గురిచూసి కొట్టడం కోసం చైనా కమ్యూనిస్టులు ఈ బాణాన్ని చేపట్టారు. ఈ రకమైన దృక్పథాన్ని అవలంబించటం వల్ల వాస్తవాల నుండి సత్యాన్ని గ్రహించగల్గుతాం. భౌతికంగా వున్న అన్ని వస్తువులు "వాస్తవం". వాటి అంతర్గత సంబంధాలను నిర్దేశించే సూత్రాలే "సత్యం", ఈ సత్యాన్ని "గ్రహించడం" అంటే అధ్యయనం చేయడం. మనం దేశం, గ్రామం, జిల్లాలోను, వాటి బయటా ఉన్న వాస్తవ పరిస్థితుల అధ్యయనంతో మొదలు పెట్టి, ఊహాజనిత సూత్రాలను (తరువాయి 4వ పేజీలో)

# కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్టు)బీహార్-జార్ఖండ్-ఉత్తర ఛత్తీస్‌ఘడ్-ఉత్తరప్రదేశ్ టెరిటోరియల్ రీజినల్ కమిటి

*పియుసిఎల్, పియుడిఆర్ సభ్యులందరికీ,*
*న్యాయ కాముక మేధావులందరికీ,*

**జెరువా** గ్రామం, మనికపోస్టు, లాతేహార్ జిల్లా (జార్ఖండ్)కు చెందిన నియామత్ అన్సారీకి మా క్రింది స్థాయి కమిటి నియమ/నిబంధనల ప్రకారం 2 మార్చి 2011న మరణశిక్ష విధించబడిందని మీకు తెలియజేస్తున్నాము. గ్రామ్ స్వరాజ్ సంస్థ, ఎన్‌ఆర్‌ఇజిపి సెంట్రల్ విజిలెన్స్ కమిటీ సభ్యుడైన జీన్‌డ్రీజ్‌లతో సన్నిహితంగా నియామత్ అన్సారీ, భుకాన్‌సింగ్‌లు పనిచేస్తున్నందున రాష్ట్రంలోని, దేశంలోని కొందరు మేధావులు ఒక్క గొంతుతో ఈ ఘటనకు సిపిఐ (మావోయిస్టు) పార్టీని విమర్శించారు. దీనితోపాటుగా జీన్‌డ్రీజ్ నాయకత్వంలో ఒక వాస్తవ సేకరణ టీమ్‌ని కూడా ఏర్పాటు చేశారు. మా ఉద్యమానికి మద్దతు తెలిపే మేధావులను కూడా దీనిలో చేర్చారు. నందలాల్‌సింగ్, గోకుల్‌బసంత్, అరుణరాయ్‌లు ఈ టీములో వున్నారు. దీనికి ప్రతిస్పందనగా సరిగ్గా ఆలోచించకుండా మాక్రింది స్థాయి కమిటీ సభ్యుడొకరు మా ప్రజాకోర్టులో ఈ మేధావి మిత్రులపై చర్య తీసికోవాలని కోరుతూ పోస్టర్లు అతికించారు. పొరులు మా సరైన చర్యదేనిపైనైనా ప్రతిస్పందనను వ్యక్తం చేయవచ్చు గనుక వాస్తవానికి ఏమాత్రం దగ్గరగాలేని కొన్ని పదాలను ఒక కరపత్రంలో వాడారు. ప్రతిస్పందనగా తమ వ్యతిరేకతను వ్యక్తంచేసే హక్కు వారికుంది. అలాంటి పరిస్థితిలో కూడా అలాంటి చర్య తీసుకోవటాన్ని మా నిర్మాణం విశ్వసించటంలేదు కనుక ఈ విషయంలో అత్యంత హృదయ పూర్వక ఆత్మవిమర్శతో మా క్రిందిస్థాయి కమిటీ సభ్యులు జారీ చేసిన ఆజ్ఞను వెనక్కి తీసుకుంటున్నాము. ఈ పొరపాట్లకు న్యాయకాముక మేధావులందరికీ క్షమాపణలు చెబుతున్నాము. ప్రస్తుతానికి భుకాన్‌సింగ్‌పై ఎలాంటి చర్యా తీసికోము. అలాంటి చర్య ఏదీ తీసుకోకుండా మాక్రింది స్థాయి కమిటీని నిషేధించాము.

నియామత్ అన్సారీకి మరణశిక్ష ఎందుకు విధించబడిందన్న ప్రశ్నకు వస్తాము. ఈ విషయంలో కూడా మాక్రిందిస్థాయి కమిటీ అనేక వాస్తవాలను అందజేసింది. అయినప్పటికీ ఈ ఘటనపై ఒక వాస్తవ సేకరణ టీము ఏర్పాటు చేయబడింది గనుక మేమింకా ఒక నిర్ధారణకు రాలేదు. లోతుగా వాస్తవాలను పరిశీలించి, వీలయినంత త్వరలో ఈ ఘటన వెనుకనున్న నిజాన్ని ముందుంచేందుకు ప్రయత్నిస్తామని మీకు హామీ యిస్తున్నాము.

విప్లవాభినందనలతో

**2011 సెప్టెంబరు 1**

ప్రతినిధి
మానస్

నోటు : *హిందీలో అందిన ఈ లేఖను పియుసిఎల్ ఇంగ్లీషులోకి అనువదించింది. పియుసిఎల్ పంపిన ఈ మెయిల్‌ను తెలుగులోకి తర్జుమా చేశాము. నియామత్ అన్సారీ హత్యపై మేధావుల ఖండనను జనశక్తి 5-4-2011 సంచికలో ప్రచురించాము. – సంపాదకుడు*

---

**అధ్యయన...** (3వ పేజీ తరువాయి)

విడనాడి, ఈ వాస్తవ పరిస్థితుల్లో అంతర్గతంగా వుండే సూత్రాలను మన ఆచరణకు మార్గదర్శకంగా గ్రహించాలి. అంటే, మన చుట్టూ జరుగుతున్న సంఘటనల్లోని అంతరంగిక సంబంధాలన్నీ కనుక్కోగలగాలి. ఈ విధంగా చెయ్యాలంటే మనం స్వీయత్మక ఊహల మీదగాని, తాత్కాలికమైన ఉత్సాహం మీదగాని, జీవంలేని పుస్తకాల మీదగాని ఆధార పడకూడదు. భౌతిక వాస్తవాల మీదనే ఆధారపడాలి. వివరాల్ని విపులంగా సేకరించాలి. మార్క్సిజం–లెనినిజం సాధారణ సూత్రాల వెలుగులో ఆ వివరాలు నుండి సరియైన అంతిమ నిర్ణయాలకు రాగలగాలి. ఈ నిర్ణయాలు అతిశయోక్తులు కావు, ఉత్త అంకెల పట్టీలు కావు. ఇవి శాస్త్రీయమైన నిర్ణయాలు. ఇది వాస్తవాల నుండి సత్యాన్ని గ్రహించే దృక్పథం. అంతేగాని, ఏదో విధంగా ఇతరులచేత మంచి అనిపించుకునే దృక్పథం కాదు. ఇది పార్టీ ఉత్తేజం యొక్క వ్యక్తీకరణ. ఇది సిద్ధాంతాన్ని ఆచరణతో సమన్వయ పరిచే మార్క్సిస్టు– లెనినిస్టు వైఖరి. ఇది ప్రతి కమ్యూనిస్టు సభ్యుడు కనీసంగానైనా కలిగి వుండాల్సిన దృక్పథం. ఈ దృక్పథాన్ని చేపట్టేవారు "తలబరువు, కాడసన్నం, వేరుశూన్యం"గానూ వుండరు. "పదునునాలిక, దళసరి చర్మం, లోనబోలు" గానూ వుండరు.

**4**

పైన వివరించిన అభిప్రాయాలకు అనుగుణంగా నేను ఈ సూత్రీకరణలు చేయదల్చుకున్నాను.

ఒకటి : మన చుట్టూ వున్న పరిస్థితుల్ని క్రమబద్ధంగానూ, క్షుణ్ణంగానూ అధ్యయనం చేయాల్సిన కర్తవ్యాన్ని మనం పార్టీముందు వుంచాలి. మార్క్సిస్టు–లెనినిస్టు సిద్ధాంతం, పద్ధతుల పునాది మీద శత్రువుల, మిత్రుల, మన ఆర్థిక, ద్రవ్యసంబంధ, రాజకీయ, సైనిక, సాంస్కృతిక, పార్టీ సంబంధమైన కార్యకలాపాల్ని వివరంగా పరిశీలించాలి. వాటిలోని మార్పుల్ని అధ్యయనం చేయాలి. అప్పుడు వాటిలో నుండి సరియైన, అవసరమైన నిర్ణయాలకు రాగలగాలి. ఈ లక్ష్యంతోటి ఈ అంశాల మీద పరిశోధన, అధ్యయనం చేయటంపై మన కామ్రేడ్స్ దృష్టిని కేంద్రీకరించాలి. పరిస్థితులను తెలుసుకోవడం, సిద్ధాంతం మీద పట్టు సంపాదించడం అనేవి రెండూ కమ్యూనిస్టు పార్టీలో అగ్రగామి స్థాయిలో వున్న సంస్థల ప్రాథమిక కర్తవ్యాలనే విషయాన్ని మన కామ్రేడ్స్ అర్థం చేసుకొనేటట్లు చేయాలి. పరిస్థితులను తెలుసుకోవడం అంటే ప్రపంచాన్ని తెలుసుకోవడం. సిద్ధాంతం మీద పట్టు సంపాదిండం అంటే ప్రపంచాన్ని మార్చడం అని అర్థం. పరిశోధన జరపనివాళ్ళకు మాట్లాడే హక్కులేదని మన కామ్రేడ్స్ అర్థం చేసుకొనేటట్లు చేయాలి. వాగాడంబరం, దృగ్గోచర విషయాలను కేవలం ఒకటి, రెండు, మూడు, నాలుగు అంటూ వరుసక్రమం పెట్టడం చాలదని వారికి తెలియజేయాలి. ఉదాహరణకి ప్రచార కార్యక్రమాన్ని తీసుకోండి. మన శత్రువులు, మిత్రులు సాగిస్తున్న ప్రచార కార్యక్రమం గురించిన పరిస్థితి మనకు తెలియకుండా మనకు సరియైన ప్రచార సూత్రాలను రూపొందించలేం. ఏ భాగానికి సంబంధించిన విషయంలోనయినా వాస్తవ పరిస్థితిని ముందు తెలుసు కోవాలి. అప్పుడు మాత్రమే సక్రమంగా పనిచేయగలం. పరిశోధనకు, అధ్యయనానికి అవసరమైన ప్రణాళికను పార్టీ అంతటా రూపొందించుకోవడం అనేది పార్టీ పని విధానంలో మార్పు తీసుకురావడానికి మౌలికమైన లంకెగా ఉపయోగపడుతుంది.

రెండు : గత వంద సంవత్సరాల చైనా చరిత్రకు సంబంధించినంత వరకు మనం అర్హులైన వ్యక్తులందరినీ సమావేశపరచాలి. వాళ్ళు పని విభజన చేసుకొని పరస్పరం సహకరించుకుంటూ దాన్ని అధ్యయనం చేయాలి. ఇలా చేయడం ద్వారా మాత్రమే, ప్రస్తుతం వున్న అస్తవ్యస్థ పరిస్థితి నుండి బయటపడగలం. ముందుగా ఆర్థిక చరిత్ర, రాజకీయ చరిత్ర, సైనిక చరిత్ర, సాంస్కృతిక చరిత్ర వంటి వివిధ రంగాలను విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేయాలి. అప్పుడు మాత్రమే సమన్వయ పూరితమైన అధ్యయనం సాధ్యపడుతుంది.

మూడు : ఆచరణలో నిమగ్నమైన కార్యకర్తలకు లేదా కార్యకర్తలకోసం నిర్వహించే పాఠశాలల్లోనూ విద్యకు సంబంధించి పార్టీ ఈ క్రింది సూత్రీకరణను ఏర్పాటు చేసుకోవాలి. అదేమంటే, చైనా విప్లవంలోని ఆచరణకు సంబంధించిన సమస్యలను మార్క్సిజం–లెనినిజం వెలుగులో అధ్యయనం చేయడానికి ఉపయోగపడే విద్యను అందించాలి. మార్క్సిజం – లెనినిజం జడపదార్థంగా, ఒంటరి ధోరణిగా అధ్యయనం చేసే పద్ధతిని విడనాడాలి. అంతేగాక, మార్క్సిజం–లెనినిజాన్ని అధ్యయనం చేయడానికి "సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ చరిత్ర (బోల్షివిక్కు) సంక్షిప్తపాఠం"ను ప్రధానమైన పాఠ్యాంశంగా తీసుకోవాలి. అది అన్నిటికన్నా మెరుగైన సమన్వయం: అది గత వందసంవత్సరాల ప్రపంచంలో యింతవరకూ ఎన్నడూ లేని సమగ్రమైన నమూనా. లెనిన్, స్టాలిన్ మార్క్సిస్టు విశ్వజనీన సత్యాన్ని రష్యా విప్లవ నిర్దిష్ట ఆచరణతో ఎలా సమన్వయం చేశారో అలా చేయడం ద్వారా, మార్క్సిజాన్ని మరింతగా ఎలా అభివృద్ధి చేయగలిగారో చూడటం ద్వారా మనం చైనాలో ఎలా పనిచేయాలో తెలుసుకోగలుగుతాం.

ఇప్పటికే ఆ విషయాలను పదేపదే చెప్పుకున్నాం. కాని సాధారణంగా తప్పులు చేయకుండా సత్యాన్ని గ్రహించడం సాధ్యం కాదు. మనం మన అధ్యయన పద్ధతుల్ని సంస్కరించుకోవడం వల్ల సజీవమైన, సంపన్నమైన చైనా, ప్రపంచ విప్లవాలకు సంబంధించి సత్ఫలితాలను పొందగలమని నేను గాఢంగా నమ్ముతున్నాను. D

---

## మధ్యప్రదేశ్ భూముల సేకరణకు ప్రజల నిరాకరణ

**మధ్యప్రదేశ్** రాష్ట్రంలో వెల్‌స్పన్ ఎనర్జీ సంస్థ విద్యుత్ పరిశ్రలను నెలకొల్పబూనుకుంది. బుజ్‌బుజా, డోకారియా, ఖన్నా, వనగాన్వా ప్రాంతాలకు చెందిన రైతులు తమ ప్రాణాలనైనా అర్పిస్తాంకానీ తమ వ్యవసాయ భూములనొదులుకోబోమని తేల్చి చెపుతున్నారు. ప్రభుత్వం బలవంతంగా తమనుండి భూములను లాక్కోవటానికి చేస్తున్న ప్రయత్నాలను వారు వివిధ ప్రజాసంఘాల, ప్రజాస్వామికవాదుల, మేధావుల సహకారంతో ప్రతిఘటిస్తున్నారు.

వెల్‌స్పన్ సంస్థ 1200 మె.వా. సామర్థ్యంగల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఈ ప్రాంతంలో నెలకొల్ప దలిచింది. దీని కోసమని 237.22 హెక్టార్ల భూముల సేకరణకు ప్రభుత్వం బయలుదేరి భూసేకరణ చట్టం–సెక్షన్ 4 ప్రకారం స్థానిక రైతులకు నోటీసులు జారీచేసింది. దీనికోసం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రతిగ్రామస్థుడూ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించాడు. ఆ మేరకు విద్యుత్ కేంద్రాన్ని తమ పంటపొలాల్లో స్థాపించేందుకు నిరాకరిస్తూ గ్రామసభలు తీర్మానాలు చేసి ఉన్నతాధికారులకు పంపాయికూడా కానీ అధికారయంత్రాంగం చనిపోయిన వాళ్ళపేరు మీద ప్రాజెక్టు స్థాపనకు అనుకూలంగా వాదనలను నమోదు చేసుకొని, గ్రామస్థులంతా ప్రాజెక్టు స్థాపనకు అంగీకరించారనే తప్పుడు నివేదికలను పై అధికారులకు అందించారు. ప్రజలు తమ భూములను ప్రభుత్వం చెప్పిన విధంగా అంగీకరించి, సంతోషంగా ఖాళీజేయకుంటే తీవ్ర పరిణామాలుంటాయని కలెక్టరు, ఎస్‌పిలు గ్రామస్థులను హెచ్చరించారు. ఈ బెదిరింపులకు ప్రజలు బెదిరిపోకుండా తమమాటపై గట్టిగా నిలిచారు. కంపెనీ దళారులు, స్థానిక పాలక రాజకీయ నేతలు, ఉన్నతాధికారులు, సమాజ వ్యతిరేక మాఫియాలు, దళారులు, గూండాలు ఒకవైపు నిలవగా ప్రజాసంఘాలు, ప్రజాతంత్రవాదులు, మేధావుల అండతో ప్రజలు, రైతాంగం తమ భూములను వదులుకొనేది లేదని గట్టిగా నిలబడి, ఆందోళన సాగిస్తున్నారు. D

---

## హర్యానా రాజీవ్‌గాంధీట్రస్టు పేరిట భూముల లీజు - ప్రజల వ్యతిరేకత

**హర్యానా రాష్ట్రం**–గురుగావ్‌జిల్లాలో పట్టణానికి ఆనుకొని వున్న ఉల్లావాస్ అనే చిన్న గ్రామంలో 100 కుటుంబాలు తమ శ్రమపైనే, భూమిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. హర్యానా ప్రభుత్వ పట్టణీకరణ పథకంలో భాగంగా ఈ రైతులు తమ భూములను కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు.

ప్రస్తుతం ఆ గ్రామంలో రాజీవ్ గాంధీ ఛారిటబుల్ ట్రస్టు పేరిట – అక్కడ ఒక క్యాన్సర్ ఆసుపత్రి, కంటి ఆస్పత్రి నిర్మించేందుకుకని–5 ఎకరాల భూమిని 33 సం॥ల లీజుకు తీసుకున్నారు. దీనిపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. పట్టణీకరణలో భాగంగా భూముల సేకరణ నుండి హర్యానా ప్రభుత్వం ఈ ఐదు ఎకరాలను మినహాయించింది కూడా! రెండు సంవత్సరాల క్రితం హర్యానా రాష్ట్ర ప్రభుత్వం ఉల్లావాస్‌లోనే పట్టణీకరణ కోసమని 500 ఎకరాల భూముల సేకరణకు నోటీసులు ఇచ్చింది. ఇందులో దేవాలయ భూములు, నివాసగృహాలు ఆఖరికి స్మశానం కూడా వున్నాయి. ఈ భూములన్నింటినీ ప్రభుత్వం సేకరించి అభివృద్ధి చేసే పేరిట ప్రైవేటు బిల్డర్లకు ఇచ్చేందుకు పూనుకుంది.

ప్రభుత్వం తమ నుండి భూములను బలవంతంగానైనా గుంజుకుంటుందనే ఆలోచనతో, ప్రజలు తమ భూములను తెగనమ్ముకున్నారు. ఆనాడు మార్కెట్ రేటు ఎకరా 5 కోట్లు ఉండగా వీరుమాత్రపు ధరకే ఎకరా 55 వేల రూ॥లకే అమ్ముకోవలిసి వచ్చింది.

మరోవైపున రాజీవ్‌గాంధి ట్రస్టు సం॥కి 15 లక్షల రూపాయల లీజుకు భూమిని పొందింది. కాగా ఈ డబ్బు కూడా గ్రామస్థులకు చేరలేదు. సం॥నికి 8 వేల రూ॥ మాత్రమే వారికి అందాయి.

గ్రామానికి చెందిన 5 ఎకరాల భూమిని హర్యానా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ రాజీవ్ గాంధీ ట్రస్టు పేరిట సేకరించే విషయం కూడా గ్రామస్తులతో సంప్రదించలేదు. గురుగావ్ జిల్లా కలెక్టర్ ఆ గ్రామ సర్పంచ్‌ను, పంచాయితీ సభ్యులను పిలిపించుకొని ఆమోదం తెల్పకుంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరికలు చేసి లోబరుచుకుని లీజు ఒప్పందం చేసుకున్నారు.

రాజీవ్ ట్రస్టు పేరిట సోనియా, రాహుల్ గాంధీలు హాస్పిటల్ నిర్మాణానికి లీజుకు తీసుకోవలసిన అవసరమేమిటని, మార్కెట్ రేటుకి స్థలాన్ని కొనుగోలు చేసి ఆసుపత్రి నిర్మాణం సాగించటం కాకుండా ఈ మార్గాన్నెంచుకోవటాన్ని గ్రామస్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

హర్యానా కాంగ్రెస్ ప్రభుత్వ అండతో పేదలు, నిస్సహాయులైన గ్రామీణ పేదల నుండి అత్యున్నత కాంగ్రెస్ అధినాయకత్వం వారి స్వార్థప్రయోజనాల కోసం ఈ విధంగా భూములు గుంజుకోవటాన్ని తీవ్రంగా నిరసిస్తూ గ్రామస్థులు ట్రస్టు పేరిట సేకరించిన స్థలం వద్దనే నిరసనను కొనసాగించి తమ తీవ్ర వ్యతిరేకతను తెలియపరిచారు.

**(బిజినెస్ స్టాండర్డ్ 6/7 ఆగస్టు, 2011 ఆధారంగా)** D

---

## కా॥ తరిమెల నాగిరెడ్డి కమ్యూనిటీ హాల్ ప్రారంభం


ఎంఎస్ నగర్ సభలో పాల్గొన్న ప్రజనీకం


ఎంఎస్ నగర్ సభలో ప్రసంగిస్తున్న శ్రీమతి కవిత

**అనంతపురం, 22-7-11 :**

ఎన్నోవిధాలైన అడ్డంకులు, ఆటంకాలను అధిగమించి రైతుకూలీ సంఘం, ఎపిఎఫ్‌టియుల ఆధ్వర్యంలో అనంతపురం పట్టణంలో ఎం.ఎస్. నగర్‌ను పేద ప్రజలు పోరాడి సాధించుకున్నారు, నిలబెట్టుకున్నారు. అమరుడు కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డి పేరిట నిర్మాణమైన ఈ కాలనీలో రోడ్లు, మంచినీరు, విద్యుత్, రేషన్‌కార్డులు తదితర సమస్యల పరిష్కారానికై సమైక్య ఆందోళన సాగించారు. ఈ క్రమంలో ఎం.ఎస్. నగర్ కాలనీ వాసుల ఉమ్మడి అవసరాల నిమిత్తమై కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికై ప్రభుత్వాధికారులకు, ప్రజా ప్రతినిధులకు ప్రజానీకం కదిలివెళ్ళి పలుమార్లు విజ్ఞప్తులు చేశారు. ప్రభుత్వం నిధులు సమకూర్చగా, మరికొందరు దాతల విరాళాలతో ఎం ఎస్ నగర్ కమ్యూనిటీ హాలు రూపుదిద్దుకొంది. జులై 22వ తేదీ ఉదయం తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ఛైర్మన్ డా॥ బి. సూర్యసాగర్ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పెద్దసంఖ్యలో కాలనీ వాసులు–ముఖ్యంగా మహిళలు పాల్గొన్నారు. ఈ హాలు నిర్మాణానికి సహకరించిన జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ శ్రీమతి తోపుదుర్తి కవిత, ఏపిఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు కా॥ సి. పెద్దన్న, కనగాలపల్లె కాలనీ పంచాయితీ సర్పంచ్ ధనుంజయ యాదవ్, సూర్యసాగర్ తదితరులు ఈ సభలో ప్రసంగించారు. కాలనీలో ప్రజలు ఈ హాల్ నిర్మాణంకోసం పడిన తపనను, చేసిన కృషిని అభినందించారు. D

# పంటల రక్షణకు యుద్ధ ప్రాతిపదికపై చర్యలు చేపట్టాలి

**రాష్ట్రంలో** రైతుల పరిస్థితి అత్యంత ప్రమాదకర పరిస్థితికి చేరుకొంది. ప్రతి సంవత్సరం సేద్యం ఖర్చులు పెరుగుతున్నా, అందుకు అనుగుణంగా పంటలకు గిట్టుబాటు ధర, మార్కెట్ సౌకర్యం కరువైయింది. ధాన్యం అమ్ముకొందామంటే అనేక వంకలతో దారుణంగా ధరను తగ్గిస్తున్నారు. గిట్టుబాటు ధరకాదుగదా మద్దతు ధర అయినా చెల్లించి రైతాంగం నుండి ప్రభుత్వ సంస్థలు ధాన్యం కొనుగోలు చేయటం లేదు. అవసరానికి ధాన్యం అమ్ముడు పోక, చేసిన అప్పులు తీరక అందునుండి బయటపడలేక రైతులు సతమతమౌతున్నారు.

అనేక సమస్యల మధ్య ఈ సంవత్సరం ఖరీఫ్ సేద్యానికి దిగిన రైతుకు ఒక సమస్య తరువాత మరొక సమస్య చుట్టు ముడుతున్నాయి. అనేక ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితుల వలన వేలాది ఎకరాల్లో సేద్యం సాధ్యంకాలేదు. వ్యవసాయం గిట్టుబాటు కావటం లేదంటూ అనేక ప్రాంతాల్లో రైతాంగం సాగుకి విరామం ప్రకటించారు. ఎరువుల ధరలు ఆకాశానికి ఎగబాకుతున్నాయి. పంట రుణాలు కౌలు రైతులకు ఎండమావిగా మారాయి. ఇస్తామన్న పంట రుణాలు కూడా రైతాంగానికి పూర్తిగా అందలేదు.

ఇలాంటి సమస్యల భారంతో సేద్యాన్ని లాక్కొస్తున్న రైతాంగానికి, పంటకు ఏర్పడిన ఉపద్రవం కల్లోల పరుస్తున్నది. గత 50 రోజులపైగా రాష్ట్రంలో పంటలకు ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు, రాష్ట్రంలో కరువు పరిస్థితికి దారి తీసింది. దీనికి తోడు రాష్ట్రంలో అమలు జరుగుతున్న కరెంటు కోత దానికి తోడై నీరులేక పంట భూములు నెర్రెలు బారి పైర్లు ఎండిపోతుంటే రైతుల కంట కన్నీరు కారుతున్నది. కొద్ది రోజుల్లో పైరు పక్వానికి వచ్చే తరుణంలో ఇలాంటి పరిస్థితి ఏర్పడటం మూలంగా రైతుల గుండెలు బరువెక్కుతున్నాయి. రాష్ట్రవ్యాపితంగా లక్షలాది ఎకరాల్లో అనేక పంటలు ఎండిపోతున్నాయి.

**మహబూబ్‌నగర్** జిల్లాలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులతోపాటు15 రోజుల పైగా మితిమీరిన కరెంటు కోత పైర్లకు శాపంగా మారింది. రెండు లక్షల ఎకరాల్లో వరి, మరో మూడు లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, కంది, ఆముదం, పత్తి తదితర పంటలు ఎండు మఖం పట్టాయి. 47మండలాల్లోని చెరువుల్లో చుక్కనీరు కూడా లభించటం లేదు. రోజుకు 4గం॥ కూడా కరెంటు లభించటం లేదు. ప్రతి 15 నిమిషాలకు కరెంటు పోతున్నది. ఫలితంగా తడిచిన భూమే తడపటం మూలంగా మిగతా భూమి తడవక పైరు ఎండిపోతున్నది. ఒక్కవరిపైరులోనే 1.25 లక్షల క్వింటాళ్ళ దిగుబడిని రైతాంగం కోల్పోతున్నారు.

**రంగారెడ్డి జిల్లాలో** వరి, కంది. జొన్న మొదలగు పంటలు నీరులేక ఎండిపోతున్నాయి. ఇబ్రహీంపట్నం, చేవెళ్ళ, మేడ్చల్ మండలాల్లో కరువు పరిస్థితి దారుణంగా ఉంది. ఇప్పటికే రెండు వేల ఎకరాల్లో వరి పైరు బీటలు వారింది. కంది 2000, జొన్న 1200 ఎకరాల్లోని పైరు ఎండిపోయింది. బోరుబావులు, చెరువుల క్రిందనే పంటలు సాగౌతాయి. వర్షాభావం వలన చెరువులు నిండలేదు. దానికి కరెంటు కోత జత కావటంతో సాగునీరు అందక పైర్లు ఎండిపోతున్నాయి.

**కర్నూల్ జిల్లాలో** ఖరీఫ్ సీజన్‌లో 12.51 లక్షల ఎకరాల్లో పంటలు వేయాల్సి ఉండగా 66వేల ఎకరాల్లో ఎటువంటి పంటలూ వేయలేదు. వేసిన దాన్లో కూడా 4.81 లక్షల ఎకరాల్లో పంటలు ఎండి పోయాయని జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి తెలియచేసింది. హాలహర్వి, అస్పరి, వెల్దుర్తి మండలాల్లో సున్నావర్షపాతం నమోదు కాగా, మరో ఐదు మండలాల్లో 10 మి.మీ. కంటే తక్కువ వర్షపాతం నమోదు అయ్యింది. 78,267 ఎకరాల్లో వేసిన పత్తి పైరుకు నీరు అందక పోవటంతో రైతులు దున్నేస్తున్నారు. కంది, ఆముదం, జొన్న పంటలు సైతం పూర్తిగా దెబ్బతిన్నాయి. **కడప, ప్రకాశం** జిల్లాల్లో ఖరీఫ్ పంటలు సగానికి సగం పోయినట్లేనని రెవిన్యూ అధికారుల లెక్కలే తెలియచేస్తున్నాయి. **ఆదిలాబాద్** జిల్లాలోని దిలావర్‌పూర్, నిర్మల్, తాంసి, తలమడుగు, సిజార్ హత్నూరు, ఇచ్చోడ మండలాల్లో 30 వేల హెక్టార్లలో పత్తి, 2,500 హెక్టార్లలో పసుపు పంటలు పనికి రాకుండా పోయాయి. **మెదక్‌జిల్లాలో** కరెంటు లేక బోరుబావుల క్రింద వరి ఎండిపోతున్నది. **నిజామాబాద్ జిల్లాలో** వర్షాభావంతోపాటు, అధిక కరెంటు కోతవలన పైర్లకు నీరు అందక రైతాంగం ఆందోళన చెందుతున్నారు. వరి పొట్టదశలో ఉన్నందున నీరు అందక పోవటం వలన 50% దిగుబడి తగ్గుతుందని అధికారులు వెల్లడిస్తున్నారు. **వరంగల్** జిల్లాలో వరి 2.50 లక్షల ఎకరాల్లో వేయగా లక్షల ఎకరాల్లో పంట ఎండిపోయింది. 5 లక్షల ఎకరాల్లో వేసిన పత్తి 60% దాకా వాడిపోయింది. **క్రిష్ణా జిల్లాలోని** బందరు, గుడివాడ రెవిన్యూ డివిజన్లలో ఆయకట్టు చివరి భూములకు నీరు అందక పైరు వాడిపోతున్నాయి. పశ్చిమకృష్ణా పరిధిలో వర్షాలు లేక సాగర్ నీరు సరిగా రాక, కరెంటు లేక పంటలు ఎండిపోతున్నాయి. **పశ్చిమగోదావరి** జిల్లాలో వర్షాలు లేక, విద్యుత్ కోత వలన 2 లక్షల ఎకరాల్లో పంటలు ఎండి పోయే పరిస్థితి ఏర్పడింది.

రాష్ట్రంలో సేద్యానికి ఇలాంటి దుస్థితి రావటానికి కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలే కారణం. అధికార మార్పిడి జరగి 64 సం॥ పూర్తి అయినా రాష్ట్రంలో సాగునీటి సమస్యను ఏ పాలక ప్రభుత్వం పరిష్కరించలేక పోయింది. సామ్రాజ్యవాద, బడాపారిశ్రామిక వేత్తల ప్రయోజనం కోసం కొన్ని ప్రాంతాలను నిత్య కరువు పీడిత ప్రాంతాలుగానే కొనసాగిస్తున్నది. అపారంగా ఉన్న నదీజలాలను, వర్షపు నీటిని నిల్వచేసే సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు నిర్మించటంలో పాలకులు పూర్తిగా విఫలమైనారు. జలయజ్ఞం పేరుతో ప్రారంభించిన ప్రాజెక్టులు ధనయజ్ఞంగా మారి శంకుస్థాపనలకు, ప్రారంభ పనులకే పరిమితమైనాయి. పాలకుల విధానాల ఫలితంగా ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా దాదాపు మూడువందల టి.ఎం.సిల నీరు సముద్రం పాలైయింది.ఈ నీటిని నిల్వచేసే పరిస్థితి ఉంటే రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఉన్నా పంటలు రక్షించబడేవి.

ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో 1.90 కోట్ల ఎకరాల్లో పంటలు సాగుచేయగా అందులో 68 లక్షల ఎకరాలు చెరువులు, బోరు బావుల క్రింద సాగౌతున్నది. ఇందుకు కరెంటు కీలకంగా ఉంది. గత ఎన్నికల్లో చేసిన 9 గం॥ కరెంటు వాగ్దానం రైతులకు ఎండమావిగా మారింది. 6గం॥ కూడా సక్రమంగా అందటంలేదు. ప్రత్యేక తెలంగాణ కోసం సకల జనుల సమ్మెలో భాగంగా సింగరేణి బొగ్గుగనుల కార్మికులు సమ్మెచేస్తామని రెండు నెలల క్రితమే నోటీసు ద్వారా తెలియపర్చారు. అనవసర కరెంటు వాడకం, దుర్వినియోగం వలన ప్రభుత్వం కరెంటు కోతను సృష్టించింది. ఇలాంటి పరిస్థితుల్లో సింగరేణి కార్మికుల సమ్మెను దృష్టిలో పెట్టుకొని థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు బొగ్గు తరలించి నిల్వచేసే చర్యలు తీసుకోలేదు. ఇతర రాష్ట్రాల నుండి కరెంటు కొనుగోలుకు నిర్దిష్ట చర్యలు చేపట్టలేదు. థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు బొగ్గుకొరతను ప్రభుత్వం సృష్టించటం వలన వాటిల్లో విద్యుత్ ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. జలవిద్యుత్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయటంలోనూ ప్రభుత్వం విఫలమైయింది. ఫలితంగా నేడు కరెంటు కొరత రాష్ట్రంలో తీవ్రంగా ఏర్పడింది.

కరెంటు కొరత ఏర్పడినప్పుడు దేనికి ప్రాధాన్యత యివ్వాలన్న ఇంగితజ్ఞానం కూడా పాలకులలకు లోపించింది. వ్యవసాయం కీలకమన్న విషయాన్ని విస్మరిస్తున్నారు. పంటలు చేతికందే సమయంలో ఇతర రంగాలకు కోత విధించి అయినా పంటలను కాపాడ వలసిన బాధ్యతను వదిలి వేశారు. ఫలితంగా బోర్లక్రింద సేద్యానికి నీరు కరువై పంటలు ఎండిపోతున్నాయి. ఫలితంగా అన్నదాతకంట కన్నీరు కారుతున్నది.

రాష్ట్రంలో ఏర్పడిన దుర్భిక్షం, కరెంటుకోతకు తన బాధ్యత లేదంటూ రాష్ట్ర ముఖ్య మంత్రి రైతాంగాన్ని వంచన చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. తెలంగాణ సకల జనుల సమ్మె అందుకు కారణమని, సింగరేణి బొగ్గు కార్మికుల సమ్మెవలన బొగ్గు సరఫరా కాక థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి పడిపోయిందని, ఇతర రాష్ట్రాల నుండి కొనుగోలు చేస్తున్నా చాలటం లేదని తెలంగాణ జె.ఎ.సి. పైకి నెపం మోపుతున్నాడు. సమ్మె జరుగుతుందని తెలిసినా థర్మల్ ప్లాంట్ల వద్ద బొగ్గు నిల్వలను ఎందుకు పెట్టలేదన్న అంశాన్ని కావాలని దాట వేస్తున్నాడు. పంటలు ఎండి పోయి పెట్టిన పెట్టుబడి నష్టపోయి మరింత అప్పుల ఊబిలోకి రైతాంగాన్ని ప్రభుత్వం నెడుతున్నది.

రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ఈ క్రింది చర్యలు వెంటనే చేపట్టాలి.

- సేద్యానికి 9 గంటల కరెంటు యిచ్చి, చేతికి అందివచ్చే పంటలను కాపాడాలి.
- పంట నష్టపోయిన వరి రైతులకు ఎకరాకు 12 వేలు, మొక్కజొన్న, కంది పంటలకు 10వేలు, పత్తికి 20 వేలు ఎకరానికి నష్టపరిహారం చెల్లించాలి.
- బీమా పథకాన్ని సడలించి అన్ని పంటలకు అమలు జరిపి పరిహారం అందించాలి. వీటిని కౌలు రైతులకు వర్తింప చేయాలి.
- చిన్న, సన్నకారు రైతుల అప్పులను రద్దు చేసి, మిగతా రైతుల రుణాలను వడ్డీలేకుండా మూడు సంవత్సరాలు వాయిదా వేసి, తిరిగి బ్యాంక్‌ల నుండి అప్పులు యిప్పించాలి
- వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించి వలసలను నివరించాలి
- ఖరీఫ్ ధాన్యం మార్కెట్‌కి వస్తున్న తరుణంలో మద్దతు ధరను పెంచి ప్రభుత్వ సంస్థలు నేరుగా రైతులనుండి కొనుగోలు చేయాలి.
- రబీ సేద్యానికి విత్తనాలు, ఎరువులు ఉచితంగా యివ్వాలి.
- దుర్భిక్ష ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి.

D

# కార్మికులు పొదుపు చేసుకున్న సొమ్మును లూటీ చేసే పెన్షన్ పథకాలు

**యు.పి.ఎ.** ప్రభుత్వం ఇటీవల పెన్షన్ సంస్కరణ చర్యలలో భాగంగా పెన్షన్ నిధి మరియు నియంత్రణ సంస్థ అనే దానిని సృష్టించి, దానికి మధ్యంతర పెన్షన్‌ను నియంత్రణ చేయడానికి చట్టబద్ధ అధికారాలు ఇచ్చి,పెన్షన్ నిధికి సంబంధించిన నియమ నిబంధనలు రూపొందించే హక్కులను ఇచ్చింది. ప్రస్తుత పరిస్థితి ఏమిటంటే పిఎఫ్ఆర్‌డిఎ (PFRDA) – నూతన పింఛను విధానానికి సంబంధించి నియమ నిబంధనలను మాత్రం రూపొందిస్తుంది. ఈ నూతన విధానం అక్టోబరు 2003 నుంచీ ఒక పరిపాలనా సంబంధమైన ఆర్డర్ ద్వారా అమలులోకి వస్తుంది. ఈ బిల్లును బిజెపి బలపరచింది. ఎందుకంటే ఈ పింఛను నిధి సంస్కరణలనేవి ఎన్‌డిఎ ప్రభుత్వపు ఆలోచనలే. ఆవిధంగా ఈ బిల్లు ఇప్పుడు లోక్‌సభ ఆమోదం కోసం ఎదురు చూస్తోంది.

భారత దేశంలో బ్రిటీషు వారి పరిపాలనా కాలం నుండీ పింఛను అనేది ఒక ఉద్యోగి యొక్క వాయిదా వేసిన వేతనంగా పరిగణింపబడింది. కనుకనే విశ్రాంత ఉద్యోగికి చనిపోయేటంతవరకు పింఛను ఇచ్చేవారు. భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఐతే పింఛను అనేది యజమాని దయతోనో, ఔదార్యంతోనో ఇచ్చేదికాదు, గతంలో ఆ ఉద్యోగి చేసిన సేవలకు ఇచ్చే ప్రతిఫలం, సామాజిక ఆర్థిక న్యాయకల్పనలో ఈ పింఛను చెల్లింపు అనేది ఒక సరైన చర్య, ఉద్యోగి వృద్ధాప్యంలో నిస్సహాయుడిగా మారకుండా, హామీనిచ్చే విధానం అని వివరించింది.

కాని ఐ.ఎమ్.ఎఫ్., ప్రపంచబ్యాంకు లాంటి సామ్రాజ్యవాద ఆర్థిక సంస్థల యొక్క నయా ఉదారవాద ఆర్థిక విధానాల ప్రకారం పింఛను అనేది సామాజిక న్యాయసాధనం కాదు–అది పెట్టుబడి దారులకు సూపర్ లాభాలు సంపాదించే సాధనం. ఈ పద్ధతి ప్రకారం ప్రభుత్వాలు ఉద్యోగులకు పింఛను సౌకర్యం ఏర్పాటు చేయనక్కర్లేదు. ఉద్యోగులు, కార్మికులు తామే నెలనెలా కొంత పొదుపు చేసుకొని పెన్షన్ ఏర్పాటు చేసుకోవాలి. దీనిని ఉద్యోగి తన జీతం నుంచి చెల్లించే పెన్షన్ విధానం అనిపిలుస్తున్నారు. 2001లో ఒక పత్రం ద్వారా ఐ.ఎమ్.ఎఫ్. సంస్థ మన పాలకులకు ఆదేశించిన పెన్షన్ సంస్కరణ ఇది. మన పాలకులు అత్యంత విధేయులుగా ఈ పత్రాన్ని ఆమోదించారు. ఈ సంస్కరణ అమలౌతున్న ఫలితంగా ఈనాడు నూతన పింఛను విధానంలో కార్మికులు, ఉద్యోగులు తమ నెలవారీ వేతనం నుండి పెన్షన్‌కు కొంత డబ్బు ఉద్యోగం చేకూరిన నాటినుండి చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇప్పుడు కార్మికులు ఈ విధంగా పొదుపు చేసిన పింఛను నిధి బోలెడంత సమకూరింది. ఈ నిధులను నియంత్రణ చేయడమనే పేరుతో నయా ఉదారవాద ఆర్థిక విధానాలు, ఈ నిధులను స్టాక్ మార్కెట్‌కు తరలించి ఎక్కువెక్కువ లాభాలు గడించాలనుకుంటున్నాయి. ఈ నిధుల కోసం విదేశీ మరియు భారతీయ పెట్టుబడిదారులు గోతికాడ నక్కల్లాగా కాచుకుని కూచున్నారు.

ఈ మధ్యనే మన కేంద్ర ఆర్థిక మంత్రి తన అమెరికా పర్యటనలో, పింఛన్‌ను బ్యాంక్ పరిశ్రమలను ప్రైవేట్ రంగానికి అప్పచెప్పే సంస్కరణలను త్వరితం చేస్తామనీ, అలాగే బీమా రంగంలో ఎఫ్‌డిఐకి ఇచ్చే ప్రయోజనాలను పెంచుతామనీ వాగ్దానాలు చేశారు.

ఇప్పుడు పెన్షన్ నిధుల రంగంలో, ఎఫ్.డి.ఐ. ప్రవేశించి, వీటి ద్వారా లాభాలార్జించటానికి ఎన్నుకున్నారు. కనుక యుపిఎ ప్రభుత్వం కొత్త పి.ఎఫ్.ఆర్.డి.ఎ. బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి త్వరగా అనుమతి తెచ్చుకోవాలని చూస్తోంది.

ఇప్పటివరకు పెన్షన్ పథకాలలో ఎఫ్‌డిఐను అనుమతించలేదు. కానీ ఇప్పుడు పెన్షన్ పథకాలలోకి ఎఫ్‌డిఐ ప్రవేశించడానికి అవకాశాన్ని కల్పిస్తూ, బిజెపికి చెందిన యశ్వంత్ సింగ్ నాయకత్వానగల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈ అవకాశాన్ని కల్పిస్తూ "పెన్షన్ రంగంలో విదేశీ మదుపు ప్రైవేట్ రంగంలో 26 శాతం వుండవచ్చుని" ఇదేదో చాల జరూరు సమస్య అన్నట్లు పెన్షన్ రంగంలో ఎఫ్.డి.ఐ. ప్రవేశం గురించి సలహా ఇచ్చింది. అంటే పరోక్షంగా ఇది ప్రైవేట్ రంగం పెన్షన్ నిధులల్లోకి ప్రవేశించడానికి ద్వారాలు తెరిచింది. ఈ ద్రోహాన్ని కప్పిపుచ్చడానికి, శ్రామికుల కన్నీళ్ళు తుడవడానికి ప్రభుత్వం ఎన్‌పిఎస్‌కు డబ్బు కట్టిన వారందరికీ పింఛను డబ్బు గ్యారంటీగా తిరిగి ఇవ్వబడేటట్లు ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. అంతేగాక ప్రభుత్వం ప్రైవేటు, పబ్లిక్ రంగాలు రెండింటిలోనూ ఎన్‌పిఎస్ వర్తించేట్లు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ప్రకటించింది. ఆ విధంగా ప్రధాన ప్రతిపక్షమైన బిజెపి కూడా పెన్షన్ రంగంలో ఎఫ్‌డిఐ ప్రవేశించే విషయంలో ప్రభుత్వ విధానాన్ని సమర్థిస్తోంది.

ఇటువంటి "పవిత్ర"మైన కాంక్షతో పెన్షన్ పథకాలలోకి మన పాలకులు ఎఫ్‌డిఐ ప్రవేశాన్ని అనుమతిస్తున్నారు. పార్లమెంటు ఎంత త్వరగా దీన్ని అనుమతిస్తోందోనని ఎదురుతెన్నులు చూస్తున్నారు.

మార్చి 31,2011 నాటికి పెన్షన్ ఫండ్‌లోని మొత్తం సొమ్ము 8585 కోట్ల రూపాయలు. ప్రైవేటు, పబ్లిక్ రంగాల్లో ఎన్‌పిఎస్ వచ్చే సమయానికి–ఈ మొత్తం మరింత పెద్ద మొత్తం కాగా – ఎఫ్‌డిఐ ద్వారా లాభాలు గడించడానికి పూర్తి అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం పెన్షన్ ఫండ్ మదుపు కార్పస్‌ను ఏడు ఫండ్ సంస్థలు నిర్వహిస్తున్నాయి–అవి 1. ఎల్ఐసి పెన్షన్ ఫండ్ లిమిటెడ్ 2. ఎస్‌బిఐ పెన్షన్ ఫండ్స్ 3. యుటిఐ రిటైర్మెంట్ సొల్యూషన్స్ 4. ఐడిఎఫ్ పెన్షన్ ఫండ్ మేనేజ్ మెంట్ కంపెనీ 5. ఐసిఐసిఐ ప్రూడెన్షియల్ పెన్షన్ ఫండ్ మేనేజ్‌మెంట్ 6. కోటక్ మహింద్రా పెన్షన్ ఫండ్ 7. రిలయన్స్ కాపిటల్ పెన్షన్ ఫండ్, ఇక పి.ఎఫ్.ఆర్.డి.ఎ. బిల్లును అంగీకరిస్తే ఎఫ్‌డిఐ సంస్థలు కూడా ఈ కార్పస్‌ఫండ్‌ను తమ ప్రయోజనాలకోసం వాడు కుంటాయి. అంటే స్టాక్ మార్కెట్ మాయాజాలానికి–లాభార్జనకు పెన్షన్ ఫండ్‌ను లూటీ చేస్తాయి.

ఈ విధంగా యుపిఎ మరియు బిజెపిలు కలిసి ఐఎమ్ఎఫ్ వత్తిడి ద్వారా–మన దేశంలో శ్రామికుల పెన్షన్‌ను ఎఫ్‌డిఐ ద్వారా లూటీ చేయడానికి ప్రయత్నాలు ముమ్మరంచేస్తున్నాయి. పాలకులు సంస్కరణల పేరుతో పి.ఎఫ్.ఆర్.డి.ఎ. బిల్లు పేరుతో చేస్తున్న మోసాలను శ్రామికవర్గం ఐక్యంగా వ్యతిరేకించడం ద్వారా త్రిప్పకొట్టాలి.

D




వెల: 15/-

అరబ్ దేశాల్లో ప్రజా ఉద్యమాలు
సామ్రాజ్యవాదుల కుట్రలు

కాపీలకు : మైత్రీ బుక్ హౌస్
28-9-1, జలీల్ వీధి,
కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

# ఆహారపంటలను మద్యం తయారీకి ఉపయోగించే, పరిసర ప్రాంతాలను కాలుష్య భరితం చేసే, పనిదినాలను హరించివేసే
# క్రక్స్ బయోటెక్ డిస్టిలరీయూనిట్ నిర్మాణ అనుమతికి పాలకుల సన్నాహాలు

**కృష్ణాజిల్లా** నందిగామ మండలం, పెద్దవరం గ్రామ పరిధిలో క్రక్స్ బయోటెక్ ఇండియా ప్రై.లిమిటెడ్‌వారు రోజుకు 60 వేల లీటర్ల సామర్థం గల ధాన్యపు గింజల నుపయోగించే డిస్టిల్లరీ యూనిట్‌ను 28.98 ఎకరాల వ్యవసాయ భూమిలో, కోట్ల రూ॥ల ఖర్చుతో నిర్మాణం ప్రారంభించేందుకు పూనుకున్నారు. ఈ యిండస్ట్రీకి పర్యావరణ అనుమతుల నిమిత్తం 'పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక'ను పయొనీర్ ఎన్విరో లేబొరేటరీస్ & కన్సల్టెంట్స్ ప్రై.లిమిటెడ్ (హైదరాబాద్) రూపొందించింది.

పర్యావరణ ప్రభావ అంచనా నిమిత్తం అధ్యయనం కొరకు ప్రతిపాదిత ప్లాంట్ ఏరియా నుంచి 10కి.మీ. దూరం వరకుగల గ్రామాలను పరిగణలోకి తీసుకున్నామని అంటూ 5 గ్రామాలనే నివేదికలో పేర్కొన్నారు. అవి–పెద్దవరం, లక్ష్మిపురం, రామన్నపేట, తాడువాయి, చల్లగరిగ గ్రామాలు. కానీ 10 కి.మీ. దూరం పరిధిలో ఉన్న కాంద్రపాడు, కోనాయపాలెం, వేదాద్రి, బండిపాలెం, కొణకంచి, బొబ్బిళ్ళపాడు మొదలైన ఈ గ్రామాలను, వీటికివున్న శివారు గ్రామాలను స్టడీ ఏరియానుండి మినహాయించారు. ఈ గ్రామాల్లో సుమారు 25 వేలమంది ప్రజలు నివశిస్తున్నారు. వీరిలో ఎక్కువమంది పేద, సన్న, చిన్నకారు రైతులే ఉన్నారు. ఇతర వృత్తులవారు, మత్స్యకారులు కూడా ఉన్నారు. ఈ గ్రామాల్లో ప్రత్తి, మిర్చి, వరి, పండ్ల తోటలు, సుబాబుల్ మొ॥ పంటలను నాగార్జున సాగర్ కాల్వల ద్వారా, ఎత్తిపోతల ద్వారా, చెరువులు, బోర్లు, బావులు మొ॥ వాటిమీద ఆధారపడి పండిస్తున్నారు. పశువులు, గొర్రెలు, మేకల పెంపకం విస్తృతంగా ఉంది. ప్రతిపాదిత డిస్టల్లరీ యూనిట్‌లో అనుకోని ప్రమాదం సంభవించినప్పుడు కలుగు పర్యావరణ కాలుష్య సమస్యల వలన రైతాంగంతో సహా ఈ ప్రాంతాల్లో వివిధ వృత్తులలో ఉన్న ప్రజానీకంలో, వారి జీవన విధానంలో ఏవిధమైన పరిణామాలు, మార్పులు చోటు చేసుకుంటాయో నివేదికలో ఎక్కడా పేర్కొనలేదు.

అలాగే ఫ్యాక్టరీకి దిగువన సుమారు 3 కి.మీ. దూరంలో చందర్లపాడు మండలం, రామన్నపేట గ్రామం వద్ద కృష్ణానదిపై రక్షిత మంచినీటిని అందించే పైలట్ ప్రాజెక్టు ఉన్నది. ఈ ప్రాజెక్టు ద్వారా చందర్లపాడు, నందిగామ మండలాలలోని దాదాపు 35–40 గ్రామాలలోని ఒక లక్షమందికి పైగా ప్రజలకు మంచినీటిని సరఫరా చేస్తున్నారు. ఈ డిస్టిల్లరీ ఫ్యాక్టరీ నుంచి రోజుకు 439 క్యూ॥మీటర్ల వ్యర్థకాలుష్య జలాలు విడుదల అవుతాయని నివేదికలో పేర్కొన్నారు. ఇంత పెద్ద మొత్తంలో వ్యర్థజలాలను ప్లాంట్ ఆవరణలో చెరువులు తవ్వి అందులో నిల్వచేస్తే భూగర్భజలాలు కలుషితం అవుతాయి. లేదా ప్లాంట్ ఆవరణ ప్రక్కనేగల వాగు ద్వారా కృష్ణా నదిలోకి విడుదల చేసినా కృష్ణా జలాలు కలుషితం అవుతాయి. ఫలితంగా ఈ కలుషిత జలాలనే రక్షిత మంచినీటి పైలట్ ప్రాజెక్టు ద్వారా 35–40 గ్రామాలలోని లక్షకు పైగా వున్న ప్రజలు త్రాగటంవలన కామెర్లు, కిడ్నీ ఫైల్యూర్స్, లివర్‌క్యాన్సర్, ఊపిరితిత్తుల జబ్బులు లాంటి ప్రాణాంతకమైన వ్యాధులకు గురికాక తప్పదు.

పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో ప్లాంట్‌లను నిర్మించే భూమిని గిడసబారిన భూమిగా పేర్కొన్నారు. కానీ వాస్తవానికి, ఇవన్నీ వ్యవసాయ భూములు. ఇందులో పత్తి, మిర్చి మొ॥ పంటలు పండిస్తున్నారు.

ప్రతిపాదిత ఫ్యాక్టరీకి రోజుకు 64.2 క్యూ.మీ. నీరు అవసరమవుతుందని పేర్కొన్నారు. భూగర్భ జలాలను కూడా వినియోగించుకుంటామని పేర్కొన్నారు. ఈ ఫ్యాక్టరీ చుట్టుప్రక్కల పొలాలలో బావులద్వారా వ్యవసాయం సాగుచేస్తున్నారు. ఈ విధంగా కంపెనీ భూగర్భజలాలను ఇంత పెద్దమొత్తంలో వెలికి తీస్తే, రైతుల పొలాలలోని బావులు ఎండిపోయి సాగు నీటికొరత సమస్యను ఎదుర్కొనవలసి వస్తుంది. తద్వారా నేలల స్వభావం మారుతుంది. భూసారంలో తేడాలొస్తాయి.

ఫ్యాక్టరీని వ్యవసాయ భూముల మధ్య నిర్మించడం వలన ఈ ఫ్యాక్టరీ నుంచి నిత్యం వెలువడే ధ్వని, వాయు కాలుష్యానికి చుట్టు ప్రక్కల పంట పొలాలలో పనిచేసే వ్యవసాయ కూలీలు, రైతులు అనేక ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుంది. కూలీలు పనులకు రావటానికి సిద్ధపడరు. ఈ స్థితిలో రైతులు వ్యవసాయం చేయలేక అనేక కష్ట నష్టాలను ఎదుర్కొనవలసి వస్తుంది. ఫ్యాక్టరీపొగగొట్టంనుంచి వెలువడే బొగ్గుమసి పంట పొలాలపై పడటం వలన ఆయా పంటలకు మార్కెట్‌లో రేట్లు లభించవు. అంతిమంగా వివిధ రకాల పంటలు పండే భూముల మధ్య ఈ రకపు ఫ్యాక్టరీలు ఉండటం తీవ్రమైన నష్టం.

పర్యావరణ నివేదికలో శూన్య విసర్జన అనగా జీరో పొల్యూషన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రయ్యర్‌ను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఇవన్నీ పూర్తిగా, దీర్ఘకాలంగా నిజాయితీగా అమలు జరుపుతారన్న గ్యారంటీ లేదు. ఉదా:కు కంచికచర్ల మండలం గండేపల్లిలో నిర్మించిన సెంటినీ బయోప్రొడక్ట్సు కంపెనీవారు తమ పర్యావరణ నివేదికలో జీరో పొల్యూషన్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కానీ ఆచరణలో దీనికి పూర్తి భిన్నంగా వ్యవహరించారు. వ్యర్థకాలుష్యజలాలను రైతుల పంటల మధ్య కాలువలు, వాగులు ద్వారా వైరా నదిలోకి విడుదల చేయడంతో ఆ నీటివలన సుబాబుల్, వరి పంటలు ఎండి పోయాయి. ఏటిలో చేపలు చనిపోయాయి. అనేక పశువులు, గొర్రెలు ఆ నీటిని త్రాగి చనిపోయాయి. ప్రజల ఆందోళన ఫలితంగా కాలుష్య నియంత్రణాధికారులు చర్యలు తీసుకున్నామని చెప్పిన తర్వాత కూడా సెంటినీ కంపెనీవారు వ్యర్థజలాలను ట్యాంకర్ల ద్వారా ఎన్ఎస్‌పి కాలువలోకి, ఊరిచివర పొలిమేరల్లో విడుదల చేస్తూనే వున్నారు. కాల్వలో నీటిని తాగిన పశువులు, గొర్రెలు చనిపోయాయి. నిబంధనలు పాటించని పరిశ్రమ యజమానులపై కాలుష్య నియంత్రణాధికారులుగాని, ప్రభుత్వాలు గాని ఏ విధమైన చర్యలు తీసుకోని ఫలితంగానే–పరిశ్రమాధిపతులు తమకు అనుమతులు వచ్చేవరకు చెప్పే మాటలను ఆచరణలో ఎక్కడా అమలు పరచడం లేదు. అందులో భాగంగానే క్రక్స్‌బయోటెక్ ఇండియా ప్రై.లిమిటెడ్ కంపెనీవారు కూడా అమలు పరుస్తారని గ్యారంటీ లేదు.

ఫ్యాక్టరీ వినియోగించే బొగ్గువలన రోజుకు కనీసం 30 టన్నుల ఫ్లైయాష్ వస్తుంది. వేదాద్రిలోని హెచ్‌పిసిఎల్ విద్యుత్ కేంద్రం నుంచి వెలువడే బూడిదను ప్రక్కనేవున్న పంటపొలాలలోకి విడిచి పెట్టడంవల్ల, పొలాలు బూడిదతో మేటలువేసి రైతాంగం ఆందోళన చెందుతున్నారు.

ఈ ఫ్యాక్టరీ వలన పెద్దఎత్తున ఉద్యోగాలు లభిస్తాయని నిరుద్యోగులకు ఆశలు కల్పిస్తున్నారు. నివేదిక ప్రకారం స్కిల్డ్ ఎంప్లాయిస్ 10 మంది; సెమిస్కిల్డ్ ఎంప్లాయిస్ 25 మంది; అన్‌స్కిల్డ్ ఎంప్లాయిస్ 65 మందికి మాత్రమే. అంటే 100 మందికి ఉద్యోగాలు ఇస్తామని మాత్రమే పేర్కొన్నారు.

నిరుద్యోగ యువతలో ఎన్నో ఉద్యోగాలు వస్తాయన్న భ్రమలు కల్పించి–ఫ్యాక్టరీయజమాన్యాన్ని ప్రశ్నించే వారిపై దౌర్జన్య చర్యలకు యాజమాన్యాలు పూనుకోవటం వలన పచ్చని పల్లెల్లో ప్రజల మధ్య కక్షలు, కార్పణ్యాలకు తెర లేపినట్లుగా ఉంది.

ఈ ఫ్యాక్టరీ సృష్టించే నిరుద్యోగాన్ని, ఆహార కొరతను పరిశీలిస్తే అనేక విషయాలు వెలుగులోకి వస్తాయి. క్రక్స్ బయోటెక్ కంపెనీకి రోజుకు 160 టన్నుల మొక్క జొన్నలుకావాలి, అంటే రోజుకు 54 ఎకరాలలోని పంట కావాలి. ఈ విధంగా సం॥నికి సుమారు 19,700 ఎకరాలలోని పంట కావాలి. మొక్కజొన్నను ప్రస్తుతం అధికభాగం డెల్టాలో 2వ పంటగా సాగుచేస్తున్నారు–మాగాణి పంటకు 48 పనిదినాలు కాగా మొక్క జొన్నకు 16 పని దినాలే అవసరమవుతాయి. ఈ విధంగా ఒక ఎకరానికి 32 పనిదినాలు చొ॥న ఒక పంటకాలానికి దాదాపు 7 వేల మంది కూలీలు వరుసగా 90 రోజులు పనులు కోల్పోతారు. ఈ ఫ్యాక్టరీవలన వచ్చే ఉద్యోగాలకంటే అది సృష్టించే నిరుద్యోగమే ప్రమాదకరమైనది.

అలాగే ఈ ఫ్యాక్టరీకి సం॥కి కావాల్సిన 19,700 ఎకరాలలో వరిపంట ఉత్పత్తి తగ్గిపోతుంది. ఆ మేరకు ధాన్యం ఉత్పత్తి తగ్గిపోతుంది. అలాగే పప్పు ధాన్యాలు, నూనె గింజల ఉత్పత్తి తగ్గిపోతుంది. ఒక ఎకరానికి ధాన్యం దిగుబడిని 30 బస్తాలుగా తీసుకుంటే 19,700 ఎకరాలలో మొత్తం 5,91,300 బస్తాలు ధాన్యం ఉత్పత్తి తగ్గిపోతుంది. ఒక బస్తాకు 50 కేజీల బియ్యం చొ॥న ఒక మనిషికి రోజుకు 1/2 కేజీ బియ్యం చొ॥న లెక్కిస్తే సం॥నికి దాదాపు 1,62,000 మంది ప్రజలు ఆహారాన్ని కోల్పోతారు. ఈ ఫ్యాక్టరీ తయారుచేసే మద్య ఉత్పత్తి కోసం ఇంతమంది ప్రజలు ఆహారాన్ని కోల్పోవటాన్ని అభివృద్ధిగా ప్రభుత్వం పరిగణించమంటోంది.

### ఆహార ధాన్యాలతో మద్యం, ఇథనాల్ ఉత్పత్తి

మొక్కజొన్న ఇతర ఆహార పంటలతో మద్యం/ఇథనాల్‌ను ఉత్పత్తి చేసే పరిశ్రమలను వ్యవసాయ ఆధారిత పరిశ్రమలుగా ప్రకటించడం దుర్మార్గమైంది. వ్యవసాయాధారిత పరిశ్రమలంటే– వ్యవసాయ పంటలను ఉపయోగించి తిరిగి వివిధ రూపాలలో ఆహారాన్ని, వివిధ ప్రజోపయోగ ఉత్పత్తులను తయారుచేసే పరిశ్రమలనే వ్యవసాయ ఆధారిత పరిశ్రమలుగా గుర్తించాలి. దేశ ప్రయోజనాలు ఆశించి ఉత్పత్తి జరగాలి.

అమెరికా, యూరప్ దేశాలలో పెట్రోలు వినియోగం పెరిగి పోవటంతో కొరతతో పాటు కాలుష్యం కూడా పెరిగినందువలన కాలుష్యాన్ని తగ్గించు కోవడానికి బయోఫ్యూయల్ ఉత్పత్తిని ప్రారంభించాయి. ఆ విధంగా ఆహార ధాన్యాలు పండే పంట భూములలో విస్తృతంగా సోయా, మొక్కజొన్న, జత్రోఫాలాంటి పంటలు పండించి ఈ విధంగా కొంతకాలం గడిచిన తర్వాత మెక్సికోదేశం ఒకప్పుడు ఆహార ధాన్యాలను ఎగుమతి చేసే దశనుంచి నేడు ఆహార కొరత ఏర్పడి, దిగుమతుల పైనే ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

ఈ మధ్యకాలంలో అమెరికాలో కూడా పెద్దఎత్తున ఆహార సంక్షోభం ఏర్పడింది. అమెరికాలో 30% పంట భూములలో మొక్కజొన్న, సోయా ఉత్పత్తి చేయడంవల్లనే ఈ దుస్థితి ఏర్పడింది. ఆహారధాన్యాల రేట్లు విపరీతంగా పెరిగి పోవటంతో ప్రజలు తమకు వస్తున్న వేతనాలలో అత్యధిక భాగం ఆహారానికే ఖర్చు చేయాల్సిరావటం వలన–వివిధ రకాల వస్తువులు మార్కెట్లో ఖర్చుకాక మాద్యం ఏర్పడింది. దీనివలన పరిశ్రమలకు నష్టాలు వచ్చాయి. వీటిని ఆదుకోవటానికి ఉద్దీపనా పథకాలను పెట్టి ప్రజాధనాన్ని వేలకోట్లరూపాయలను పారిశ్రామికవర్గం పొందగల్గింది. ఇదిమన దేశంలో కూడా అమలు అయింది. ఈ దశలో అమెరికా, యూరప్ దేశాలు 3వ ప్రపంచ దేశాలైన భారత్, చైనా లాంటి దేశాల్లో ఆహారపంటల భూములలో మొక్కజొన్న సాగును పెంచే వైపుగా ప్రభుత్వాలతో ఒప్పందాలు చేసుకున్న ఫలితంగానే నేడు డెల్టా ప్రాంతంలో 2వ పంటగా మొక్కజొన్న సాగును పెద్దఎత్తున సాగుచేయిస్తున్నారు. ఈ విధంగా తమ భారాన్ని మనపై రుద్దుతున్నారు.

మద్యం వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్న మన ప్రభుత్వం మొక్కజొన్నల ద్వారా ఇథనాల్ తయారీతో పాటు మద్యం ఉత్పత్తిని కూడా తయారు చేయడానికి విచ్చల విడిగా లైసెన్స్‌లు ఇవ్వడంతో –ప్రజల బలహీనతలపై ఆధారపడి తక్షణ లాభాలను పొందాలనుకున్న పెట్టుబడిదారీ వర్గం 90% మద్యం ఉత్పత్తిని, 10% ఇథనాల్ ఉత్పత్తిని చేస్తున్నాయి. ఈ ఇథనాల్‌ను యూరప్ దేశాలకు ఎగుమతి చేయటం ద్వారా ఆయా దేశాలు దీన్ని పెట్రోలులో కలుపుకొని కొంత కాలుష్యాన్ని తగ్గించుకుంటున్నారు. ఈ విధంగా రాబోయే 5–10సం॥ కాలంలో మనదేశం కూడా తీవ్రమైన ఆహార సంక్షోభాన్ని ఎదుర్కోవలసి వస్తుంది. కనుక ప్రజాప్రయోజనాల ప్రాధాన్యతనిచ్చి ఈ రకపు పరిశ్రమలకు అనుమతులను నిలిపి వేయటం కోసం ప్రజాందోళనను తీవ్రంచేయాలి. D

# క్రక్స్ బయోటెక్ సంస్థ నిర్మించనున్న ఆల్కహాల్ డిస్టిలరీపై
# ప్రజాభిప్రాయ సేకరణ–ప్రజల తీవ్ర నిరసన




**పెద్దవరం, కృష్ణాజిల్లా, 27-9-11 :**

కృష్ణాజిల్లా నందిగామ మండలం పెద్దవరం గ్రామంలో కృష్ణానదికి ఒక కిలో మీటరు దూరంలో పంట పొలాల నడుమ మొక్కజొన్నలు, ఇతర ఆహార ధాన్యాలనుపయోగించి, 60వేల లీటర్ల సామర్థ్యంగల క్రక్స్ బయోటెక్ సంస్థకు ఆల్కహాల్ డిస్టిలరీ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ కాలుష్యనియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయసేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. (ఈ ఆల్కహాల్ డిస్టిలరీ పూర్తి వివరాలు ఇదే సంచికలో చూడగలరు)

ఉదయం 11 గంటలకే ప్రతిపాదిత పరిశ్రమ ప్రాంత పరిసర గ్రామాల నుండి 3000 మందికి పైగా ప్రజలు ప్రజాభిప్రాయ సేకరణ స్థలం వద్దకు చేరుకున్నారు. కాగా సంబంధిత పరిశ్రమ యాజమాన్య ప్రోత్సాహ, ప్రోత్బలాలతో మరికొందరు వారికి అనుకూలంగా సమావేశ ప్రాంగణం వద్ద మోహరించారు. ప్రతిపాదిత డిస్టిలరీ నిర్మాణం కారణంగా ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందనీ, ఉద్యోగాలు పెద్దఎత్తున కల్పించ బడతాయనీ యాజమాన్యం వైపునుండి ప్రకటించే సందర్భంలో ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమౌతూ వచ్చింది. ప్రజాభిప్రాయసేకరణకుగానూ రూపొందించిన పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక అసమగ్రంగానూ, అవాస్తవాలతోనూ కూడుకొనివుంది.

గండేపల్లి సెంటినీ బయోప్రొడక్ట్సు పేరిట ఇథనాల్ తయారుచేసే డిస్టిలరీ దుష్ఫలితాలను ఈనాటికీ అనుభవిస్తున్న చందర్లపాడు, నందిగామ మండలాలలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన పెద్దలు ఈ సదస్సులో పాల్గొని ప్రతిపాదిత ఆల్కహాల్ డిస్టిలరీ నిర్మాణంపట్ల తమ తీవ్రవ్యతిరేకతను తెలియజేశారు.

ఈ సందర్భంగా రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥ ముప్పాళ్ళ భార్గవశ్రీ మాట్లాడుతూ పర్యావరణ నిబంధనలన్నింటినీ అమలు చేస్తామని అంగీకరించి నిర్మించిన గండేపల్లి ఇథనాల్ కంపెనీ నిబంధనలన్నింటినీ తుంగలోతొక్కి పారిశ్రామిక వ్యర్థాలన్నింటినీ పంటపొలాల గుండా వైరా ఏటిలోకి వదలటం ఫలితంగా తీవ్ర పర్యావరణ సమస్యలు ఏర్పడినప్పటికీ ప్రభుత్వ అధికారయంత్రాంగం ఏ విధమైన చర్యలూ తీసుకోలేదనీ, ప్రతిపాదిత క్రక్స్ బయోటెక్ పరిశ్రమ విషయంలోనూ అదే పరిస్థితి కొనసాగుతుందని, దాని నిర్మాణాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. దేశంలో ప్రజలందరికీ తగినంత ఆహారం లేకుండా అలమటిస్తుంటే ఆహార ధాన్యాలనుపయోగించి, లిక్కర్ తయారు చేయబోవటాన్ని; ఉద్యోగవకాశాలను ఏ మాత్రం పెంచకపోగా ఎన్నోపనిదినాలను హరించి వేసేటువంటి ఈ ప్రతిపాదిత పరిశ్రమ నిర్మాణానికి అనుమతి నీయరాదని కా॥ భార్గవశ్రీ విజ్ఞప్తి చేశారు.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ రాంబాబు మాట్లాడుతూ, సారవంతమైన వ్యవసాయ భూములలో ఈ పరిశ్రమ నిర్మాణానికి తలపెడుతూ, పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో బీడుభూములుగా పేర్కొనటంలోని మోసకారితనాన్ని ప్రశ్నించారు.

పర్యావరణవేత్త కె. బాబూరావు మాట్లాడుతూ పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలోని లొసుగులను బయటపెట్టారు. దీనిపై న్యాయపోరాటం జరుపుతామన్నారు.

పర్యావరణ పరిరక్షణ కమిటి నాయకులు వాసిరెడ్డి సాంబశివరావు, గోపాలకృష్ణసాయి, మండాది వెంకటేశ్వర్లు, గంగవరపు నరసింహారావు, కృష్ణమూర్తి, రామనాథం తదితరులు ప్రతిపాదిత డిస్టలరీ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతినివ్వరాదని మాట్లాడారు. వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని తమ వ్యతిరేకతను తెలియజేశారు.

రైతుకూలీసంఘం చొరవతో వివిధ ప్రజాసంఘాల, శక్తులతో 'పర్యావరణ పరిరక్షణ కమిటీ' నేర్పరచి, దాని ఆధ్వర్యంలో ప్రతిపాదిత డిస్టిలరీ నిర్మాణం ఫలితంగా ఏర్పడనున్న దుష్ఫలితాలపై ముందునుండీ విస్తృత ప్రచారం జరిపారు. రాష్ట్ర మానవహక్కుల కమీషన్‌కు రిపోర్టు చేశారు. ముఖ్యమంత్రితో సహా, ప్రజా ప్రతినిధులందరికీ విజ్ఞప్తి చేశారు. సంతకాల సేకరణ జరిపారు– ప్రజలందరితో కలిసి వెళ్ళి జిల్లా, మండల అధికారులకు మెమోరాండం అందించారు. మొత్తం ఈ కృషిఫలితంగా ప్రజాభిప్రాయ సేకరణ నాటికి ప్రజలు పెద్దఎత్తున కదిలివచ్చి క్రక్స్ బయోటెక్ నిర్మించనున్న డిస్టిలరీపట్ల తమ తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేశారు. D

# పెట్రోల్, గ్యాస్ ధరల పెంపుకు నిరసన



బందరులోలో ధర్నా



అనంతపురంలో ప్రదర్శన

**మచిలీపట్నం, 16-9-11 :**

**పెంచిన** పెట్రోల్, వంటగ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టరు ఆఫీసు ఎదుట రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) మరియు ఎపిఎఫ్‌టియు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ ధర్నానుద్దేశించి రైతుకూలీసంఘం. (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ కొప్పినేని ఉమామహేశ్వరరావు ప్రసంగిస్తూ అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరపెరిగిందని, అంతర్జాతీయమార్కెట్‌లో రూపాయి మారకం విలువ క్షీణించిందని, ఏదోఒక సాకు చూపి ఆయిల్ ధరలు, వంటగ్యాస్, (ఎల్.పి.జి.) ధరలు పెరగటం వల్ల, రవాణా ఆర్టీసీ చార్జీలు పెరిగి పేదమధ్యతరగతి వర్గాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారనీ కేంద్రప్రభుత్వం ఆయిల్ ధరలపై నియంత్రణఎత్తివేసి ఆయిల్ కంపెనీలకు కోట్ల రూపాయలు సంపాదించుకోటానికి అవకాశం కల్పించిందనీ; ప్రపంచబ్యాంకు షరతుల్లో భాగంగానే పాలకులు ఇవన్నీ అమలు చేస్తున్నారని అన్నారు. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా కమిటి సభ్యులు కా॥ ఇ. రాంబాబు ప్రసంగిస్తూ గత మే నెలలో కేంద్రం పెట్రోల్ లీటరుకు రూ. 5/-లు పెంచి మరల జూన్ నెలలో డీజిల్ 3/- రూ॥లు లీటరుకు; కిరోసిన్ ధర లీటరుకు-2/- రూ॥లు; వంటగ్యాస్ (ఎల్‌పిజి) సిలెండరు ధర రూ. 50/- లు. చొప్పున పెంచి, మరల రూపాయి మారకం విలువ క్షీణించిందని పెట్రోల్‌కు లీటరు ధర రూ. 3.14; గ్యాసు సిలండర్ ధరలు పెంచటమనేది ఆయిల్ వ్యాపారులు కోట్ల రూపాయలు సంపాయించుకోవటానికి అవకాశం కల్పించటం తప్ప ప్రజాప్రయోజనాలు ఏవీలేవన్నారు. సర్దుబాటు ఛార్జీల పేరుతో కరెంటు ఛార్జీలను పెంచి వసూలు చేయాలని చూస్తున్నారు. పాలధరలను పెంచారు. తక్షణమే పెంచిన పెట్రోల్ ధరలను, గ్యాస్, నిత్యావసరాల ధరలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇంకా ఈ కార్యక్రమంలో ఎపిఎఫ్‌టియు నాయకులు కా॥ బి. రవి, ఎపిఎఫ్‌టియు బందరు ఏరియా కార్యదర్శి కా॥ ఎం. సుధాకరరావు, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

**అనంతపురం, 19-9-11 :**

**కేంద్రప్రభుత్వం** పలుమార్లు పెంచుతున్న పెట్రోలు ధరల భారం మధ్య తరగతి, ఆర్థికంగా దిగువ వర్గాల ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, ఈ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఏపిఎఫ్‌టియు ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్ క్లబ్ నుండి టవర్ క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్‌కు ప్రదర్శన నిర్వహించి ఆ కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. ధరల పెరుగుదలకు కారణమైన కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మని దగ్ధం చేశారు.

ఏపిఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు కా॥ సి. పెద్దన్న ఈ సందర్భంగా ప్రసంగిస్తూ నానాటికీ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల తగ్గింపుకై సంఘటిత పోరాటాలు మినహా మరో పరిష్కార మార్గం లేదన్నారు. చమురు సంస్థలకు నియంత్రణాధికారాన్ని కట్టబెట్టిన కేంద్రప్రభుత్వం యొక్క దళారీ స్వభావం వలన ప్రజలయొక్క జీవనస్థాయి తగ్గుతుందని, కనీసపాటి ఆహారాన్ని కూడా అందకుండా నిత్యవసరాల ధరలను పెంచిన పాలకులు మరోసారి పెట్రోలు ధర పెంపుతో ప్రజలపై మరింత భారాన్ని మోపారన్నారు.

ఈ కార్యక్రమంలో ఇంకా ఆటో యూనియన్ నగర కార్యదర్శి ఎ. నాగభూషణం; ఉపాధ్యక్షుడు ఎస్. భాష; భవననిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి కా॥ సి. సుధాకర్, ఉపాధ్యక్షులు రాజు; స్త్రీ విముక్తి సంఘటన నగర కన్వీనర్ సరిత తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు. 200 మంది పైగా కార్మికులు, మహిళలు ఈ ప్రదర్శన, రాస్తారోకో కర్యక్రమాలలో పాల్గొన్నారు.



పిడుగురాళ్లలో ప్రదర్శన

**పిడుగురాళ్ళ, 17-9-11 :**

**రూపాయి** విలువ పడిపోయిందనే సాకుతో తమకు నష్టాలు వస్తాయిని చెప్పి పెట్రోలు ధర లీటరుకు 3.30 పెంచటాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక రైతుకూలీసంఘం, స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రదర్శన, రాస్తారోకో జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన ధర్నాలో రైతుకూలీసంఘం జిల్లా నాయకుడు కా॥ ఎన్. రాంబాబు మాట్లాడుతూ పెట్రోల్ ధరలు పెంచడం అనివార్యమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించటాన్ని తీవ్రంగా ఖండించారు. స్త్రీ విముక్తి సంఘటన జిల్లా నాయకురాలు కా॥ ఎం. నిర్మల మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో ప్రజలందరూ సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య సున్నం మిల్లుల వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఇనుముక్కల పౌలేసు, వెంకటేశ్వర్లు, ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు. D

# ఆందోళనా మార్గంలో వేతనాలు పెంచుకొన్న డైయింగ్ కార్మికులు

**సిరిసిల్ల, 7-9-11 :**

**సిరిసిల్ల** డైయింగ్ కార్మికులు ఏపిఎఫ్‌టియు ఆధ్వర్యాన సమ్మెచేసి వేతనాలను పెంచుకొన్నారు. యాజమాన్యాలు అనుసరించిన అనేక కుట్రపూరిత చర్యలను తిప్పికొట్టి విజయవంతం అయ్యారు.

సిరిసిల్లలోని డైయింగ్ కార్మికుల పనివిధానం చాలా కష్టభరితమైనది. అనేక రసాయనాలలో ముంచి తీసిన బట్టకు రంగులు అద్దేందుకు చాలా కష్టపడాల్సిఉంటుంది. సుమారు 220మీటర్ల గుడ్డను గుంజుకొని పోవాల్సి వుంటుంది. ఇలాంటి పని చేసే యూనిట్ల ఒప్పంద కాల పరిమితి మార్చి 31కి ముగిసింది.

'ఏపిఎఫ్‌టియు అనుబంధ కరీంనగర్ డైయింగ్ వర్కర్స్ యూనియన్' నాయకత్వం ఒప్పంద కాలపరిమితి ముగుస్తున్న విషయాన్ని గుర్తు చేస్తూ, నూతన వేతన ఒప్పందానికై యాజమాన్యాలకు డిమాండ్ నోటీసులు ఇచ్చింది. దీనిపై యాజమాన్యాలు చర్చలకు పిలిచిన సందర్భంలో యూనియన్ గతంలో ఆర్డినరీ లాటుకి ఇస్తున్న రూ. 56.50 పైసల్ని 100 రూ॥కు పెంచాలని; స్పెషల్ వాటికి ఇప్పుడు ఇస్తున్న 61.50 పై.ను 120 రూ॥లకు పెంచాలని; లాటు నిడివిని 250 మీటర్ల నుంచి 220 మీటర్లకి తగ్గించాలని; గ్లౌవ్స్, అరటిపళ్ళు, కొబ్బరినూనె, వంటి సౌకర్యాలు కల్పించాలని; గ్రూపు ఇన్సూరెన్సు చేయాలని తదితర డిమాండ్‌లతో డిమాండ్స్ పత్రాన్ని అందజేశారు. దీనిపై యాజమాన్యాలు కరీంనగర్ డైయింగ్ వర్కర్స్ యూనియన్‌తో, ఇతర యూనియన్లతో రెండుసార్లు చర్చలు జరిపాయి. 3వసారి చర్చలకి ముందు ఒక గంట సమయం మాత్రమే ఇచ్చి యాజమాన్యాలు కార్మిక యూనియన్లను చర్చలకి ఆహ్వానించాయి. చర్చలకి ఆ విధంగా సమయం నిర్ణయించడం సరికాదని ఏపిఎఫ్‌టియు అనుబంధ యూనియన్ అభ్యంతర పెడుతున్నా, తమతో ఒప్పందానికి సిద్ధమైన యూనియన్‌లతో 10 రు॥ల పెంపుదలకి ఒప్పందం కుదుర్చుకొని, ఒప్పందం జరిగిపోయిందని యాజమాన్యాలు ప్రకటించాయి.

దీనిపై ఆగ్రహించిన కార్మికులు 18-8-2011న నోటీసు ఇచ్చి 22-8-2011 నుంచి సమ్మెకు దిగారు. సుమారు 20 యూనిట్ల కార్మికులందరూ సమ్మెలో పాల్గొని తమకు న్యాయం చేయమని కార్మిక అధికారులను కోరారు. గేట్లుముందు బైఠాయించిన కార్మికులపై యజమానులు కేసులు బనాయించేందుకు ప్రయత్నించారు. ఈ బెదిరింపులను లెక్కచేయకుండా కార్మికులు ఆందోళన సాగించారు. చివరకు 7-9-2011న జిల్లా కార్మికాధికారి సమక్షంలో యజమానులతో చర్చలు జరిగి 11 రూ॥ పెంపుదలకు ఒప్పందం కుదిరింది. ఫలితంగా ఆర్డినరీ లాటుకి 67.50పై; స్పెషల్ లాటుకి 72.50పై; పెంపుదల జరిగింది. 220 మీటర్ల గుడ్డకి లాటు చొప్పున ఉండాలని అంగీకరిస్తూనే, ఒకవేళ 220 మీటర్లకంటే ఎక్కువ ఉంటే దానికి తగ్గట్టు అదనపు పైకం ఇచ్చేందుకు, కార్మిక సంక్షేమనిధిని ఏర్పరచేందుకు కార్మికుల నుండి 2 రూ॥ యజమాని నుండి 5 రూ॥ మొత్తం 7 రూపాయలు కట్టే ఒప్పందం జరిగింది.

కరీంనగర్ డైయింగ్ వర్కర్స్ యూనియన్‌ను పక్కనపెట్టి ఒప్పందం కుదుర్చుకొని యూనియన్‌ను దెబ్బతీయాలని యాజమాన్యం చేసిన ప్రయత్నాలు విఫలమైనాయి. కార్మికులు సంఘటిత శక్తిని ప్రదర్శించి విజయం సాధించినందుకు, సహకరించిన వారందరికీ ఏపిఎఫ్‌టియు రాష్ట కార్యవర్గ సభ్యులు కా॥ వి. కిషోర్ అభినందనలు తెలియ చేసారు. D

# మజూరి పెంపుకై చేనేత కార్మికుల ఆందోళన

**ఈపూరిపాలెం, 19-9-11 :**

**నిత్యావసరవస్తువుల** ధరల పెరుగుదలతో చాలీచాలని మజూరీలతో చేనేత కార్మికులు బ్రతకడమే కష్టంగా మారింది. ఈ పరిస్థితులను తట్టుకోలేక అనేక మంది చేనేత కార్మికులు కొందరు ఆత్మహత్యలకు పాల్పడగా, మరికొందరు ఇతర వృత్తులు చేపడుతున్నారు, వేరే ప్రాంతాలకు వలస వెళుతున్నారు. దాదాపుగా 30 నుండి 40 శాతం కార్మికులు ఈ వృత్తిని వదిలిపోతున్నారు.

ఈ నేపథ్యంలో ఈ వృత్తిని కాపాడుకోవాలన్నా, ఈ వృత్తిపై ఆధారపడి జీవించే చేనేత కార్మికులకు కనీస అవసరాలైన కూడు, గుడ్డ, గూడు తదితరాలు సమకూరాలన్నా పెరిగిన ధరలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కూలిరేట్లుకూడా పెరగాలి.

కనుక మజూరీలను 30 శాతం పెంచాలని, రకం మార్చిన ప్రతిసారీ కార్మికులు అప్పుల పాలౌతున్నారు కనుక అమరికకు అయ్యే ఖర్చును, కార్మికులు కోల్పోయిన పనిదినాల ఖర్చును మాస్టర్ వీవర్సే ఇవ్వాలని, చేనేత వృత్తిని రక్షించు కోవడం కోసం చేనేతకు గొడ్డలిపెట్టుగా మారిన పవర్‌లూం ఉత్పత్తిని, అమ్మకాన్ని మాస్టర్‌వీవర్స్ నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈపూరుపాలెంలోని చేనేత కార్మికులు, చేనేత కార్మిక మిత్రమండళ్ళుగా ఏర్పరచుకొని ఆందోళనా కార్యక్రమం చేపట్టారు. వివిధ ప్రాంతాలలో స్థానిక కమిటీలను ఏర్పరచారు. 19వ తేదీన ఈపూరుపాలెం మెయిన్ సెంటర్ నుండి చేనేత కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో సాయికాలనీ, మూడువందలు కాలనీ, సిండికావీవర్స్ కాలనీ, తోటవారిపాలెం వీవర్స్‌కాలనీ, ఇందిరా నగర్, భావనారుషిపేట, పురుగులపేట, కమిటీల నాయకత్వంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 200మందితో ప్రారంభమైన ప్రదర్శన మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ వద్దకు చేరుకునే సరికి నాలుగువందలకు చేరుకుంది. ప్రదర్శన ఆసాంతం పెద్దఎత్తున నినాదాలతో తమ డిమాండ్లను ప్రజలకు మాస్టర్‌వీవర్స్‌కు తెలియజేశారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అసోసియేషన్ నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి మునగాల బాబూరావు, ఆకురాతి మధుసూదనరావు, గుర్రం శ్రీనివాసరావు, గుద్దంటి సుబ్బారావు, నూకల పోతురాజు, ఇంకా వివిధ స్థానిక కమిటీల నాయకులు నాయకత్వం వహించారు. D



వేటపాలెంలో ప్రదర్శన

# 'అందరికీ విద్య, ఉపాధి హక్కులకై పోరాడాలి'

**రేపల్లె, 13-9-11 :**

'విద్యా, ఉపాధి రంగాలలో సంక్షోభం' అంశంపై పిడిఎస్‌ఓ ఆధ్వర్యంలో స్థానిక ఎబిఆర్ డిగ్రీకళాశాల లోని సెమినార్‌హాల్‌లో సభ జరిగింది. ఈ సభకు కా॥ నాగబసవయ్య అధ్యక్షత వహించారు.

ప్రధానవక్తగా విచ్చేసిన ఎపిఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి పి.డి. సోషలిజం మాట్లాడుతూ విద్యను ప్రజలందరికి అందించే వైపుగా ప్రభుత్వ విధానం లేదనీ, విద్య వ్యాపారంగాను, మార్కెట్‌లో వస్తువులా మార్చివేయబడిందనీ, విద్యను కార్పోరేట్ సంస్థలకు అప్పచెప్పిన ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందనీ, విద్యాహక్కు చట్టం-2009 అందరికీ నిర్బంధ విద్యనందించేదిగా లేకపోగా విద్యార్థులను విద్యకు దూరం చేసేదిగా వుందనీ, ఒకటవ తరగతినుండి ఇంగ్లీషు బాషను ప్రవేశ పెట్టడం, 25% విద్యార్థులను కార్పోరేట్ పాఠశాలల్లో చేర్చటం వంటి విధానాలతో ఈ చట్టం పూర్తిగా విద్యను ప్రైవేటు సంస్థల చేతుల్లో పెట్టిందనీ, ఫీజురీఎంబర్స్ మెంట్, సమీకృత హాస్టళ్ళ విధానం అన్నీ కూడా విద్యారంగాన్ని కార్పోరేట్ చేతుల్లో పెట్టటమేననీ; విద్యాఉపాధి రంగాలలో కూడా సంక్షోభానికి కారణమవుతున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా "కామన్ ఎడ్యుకేషనల్ విధానం" కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

పిడిఎస్‌ఓ జిల్లా కార్యదర్శి కె. శ్రీను మాట్లాడుతూ అందరికీ విద్యా, ఉపాధికోసం; పాఠశాలల, కళాశాలల పరిరక్షణకై సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ సభలో ఎబిఆర్ కళాశాల ఆధ్యాపకులు శ్రీ కె. భాస్కరరావు, శాస్త్రీయ విజ్ఞానవేదిక ప్రతినిధి మోపిదేవి ఈశ్వరరావు తదితరులు ప్రసంగించారు.


మహోజ్వల తెలంగాణ రైతాంగ సాయుధపోరాట



నవలా సాహిత్యం- పరిచయాలు- పరిశీలన

కాపీలకు : మైత్రీ బుక్ హౌస్ 28-9-1, జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

సిపిఐ (ఎం-ఎల్) ప్రచురణ

సామ్రాజ్యవాద కంపెనీల అనైతిక ఔషధ ప్రయోగాలు

వెల: 12/-

కాపీలకు : మైత్రీ బుక్ హౌస్ 28-9-1, జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

# మహిళల స్వేచ్ఛా గీతం

*ఈ గేయ రచయిత ఖంజా ఖాక్మి జదె నియాజి (1889-1929), సోవియట్ యూనియన్‌లోని ఇజ్బెకిస్థాన్‌కు చెందిన వాడు. అక్టోబరు విప్లవానంతరం ఆయన కవితలెన్నో రాశారు. విప్లవ పోరాటపు భావోద్వేగాలను తన సాహిత్యంలో ప్రతిబింబించారు. ఎన్నో నాటకాలు రచించారు. తన రచనలలో ఉజ్బెకిస్థాన్ శ్రామిక ప్రజానీకంలో వెల్లువెత్తుతున్న చైతన్యాన్ని చిత్రించారు.*

*తూర్పు ప్రాంతంలో మహిళల విముక్తి గురించి కూడా ఖంజా రచనలు చేశాడు. స్త్రీలందరూ, సామాజిక జీవితంలో అన్ని రంగాలలో చురుకుగా పాల్గొనాలని పిలుపు ఇచ్చారు. వాటిలో ఈ గేయం ఒకటి.*

*– మార్క్సిస్ట్ ఆర్ట్ సౌజన్యంతో*

రండి రండి అక్కలార చెల్లెళ్లార
మహిళలందరం మహోత్సాహంగా ఆడుకుందాం-పాడుకుందాం

రండి రండి బురఖాలను బుగ్గిచేసి
ఈ వెచ్చని, తేజోమయ జగత్తులోకి

మనకు స్వేచ్ఛనిచ్చిన రాజ్యాన్ని అభినందిద్దాం
అందుకే రండి, కలపండి చేతులు
ఆడుకుందాం, పాడుకుందాం ఆనందంగా

మనమిప్పుడు రెక్కలు విప్పిన పక్షుల్లాగ స్వేచ్ఛగా ఎగురుదాం
కోకిల తిరిగి వచ్చింది-మనకోసమే పాడుతోంది

మనల్ని మంత్రముగ్ధంచేసే మురళీ వాద్యకారుడొచ్చాడు
మన స్వేచ్ఛ గురించి పాడుతూ వీనుల విందులు చేస్తాడు

గతంలో తోటగోడప్రక్కన సిగ్గుతో ముడుచుకొని వున్న పుష్పాలం మనం
అయితే ఈనాడు మన సౌందర్యం ఎంత వికసించింది, అందరిలో ఒకరిమయ్యాక

ఆనందంగా గుంపులుగా రోడ్లపై స్వేచ్ఛగా నడుస్తున్నాం
గత కాలపు బంధనాలనుండి, రాజ్యం నుండి విముక్తిచెందాం

గతంలో మూగగా, వేధింపులకు గురైనా, అణచివేతకు గురైనా
ఇప్పుడు పురుషులకు నాయకులం-మనకు స్వేచ్ఛవచ్చేసింది

మనకాలం వచ్చేసింది - మనల్ని బంధించిన వారిని తరిమేశాం
మన తేజోమయ కాంతులనిక అడ్డుకోలేరే మాత్రం

ఇక ఏ భర్తా తన భార్యని ఇనుప తలుపుల వెనుకవుంచలేడు
ఈనాడు మనం స్వేచ్ఛాజీవులం-సంకెళ్ళిక లేనేలేవు

ఎందరో అసూయాగ్రస్తులైన మగవారున్నారు
వారినెదిరిస్తూ పోరాడితే మన అందం ఇనుమడిస్తుంది-
వాళ్లు పునరాలోచించుకోవాల్సిన సమయం ఇది

ఎవరైనా మలిన దృక్కులతో మనలను కలుషితంచేస్తే
ప్రతీకారం తీర్చుకుంటాం-మనమిప్పుడు స్వేచ్ఛాజీవులం కదా!

మన స్వేచ్ఛే మన వసంతం-మనమే వెలుగుతున్న పుష్పాలం
కనుక రండి రండి ఈ ఆనంద వలయంలో చేరండి

ప్రపంచాన్నంతా కళలతో నింపుదాం
మన లక్ష్యం జ్ఞానప్రపంచం-ఇక అంతకు మించి మంచి పంథా లేదు

విజ్ఞానశాస్త్రం అందించే జ్ఞానాన్ని పుక్కిటపడదాం
మన ఆనందాన్ని ఇనుమడింపచేసుకుందాం-శాశ్వతం చేసుకుందాం

నీ కళ్ళు పైకెత్తు-నీవూ ఒక మనిషివే
నీ విజయోత్సాహంతో ఉషస్సు నవీన కాంతులీనుతోంది

రచయిత
ఖంజా ఖాక్మి జదె నియాజి

# ఎరువుల ధరల పెంపుకు నిరసన


రెంటచింతలలో ప్రదర్శన


పిడుగురాళ్లలో ప్రదర్శన

**గుంటూరు జిల్లా :**

**ఏటేటా** ఎరువుల కొరత సమస్యతోపాటు, ఎరువుల ధరల పెరుగుదల సమస్య కూడా రైతులను క్రుంగదీస్తున్న కారణాలలో ఒకటిగా వుంటున్నది. ఎరువుల తయారీ, సరఫరాల నుండి ప్రభుత్వం వైదొలగటంతోపాటు, ఎరువుల ధరలపై నియంత్రణను ప్రభుత్వం పూర్తిగా ఎత్తివేయటంతో బడా, బహుళజాతి కంపెనీల ఇష్టారాజ్యమైంది. పోషకాధారిత సబ్సిడీ పేరుతో రైతులకు ఇవ్వవలసిన ఎరువుల సబ్సిడీలన్నింటినీ ఎరువుల పరిశ్రమల యాజమాన్యాలకు ప్రభుత్వం కట్టబెడుతున్నది. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల ధరలను ఇప్పటికే మూడు విడతలుగా పెంచారు. రాష్ట్రానికి అందించే ఎరువులలో కూడా 30 శాతం మాత్రమే సహకార సంఘాలకు అందిస్తూ, మిగిలిన 70 శాతం ఎరువులను ప్రైవేటు డీలర్లకు కేటాయించటం సమస్యను మరింత జటిలం చేస్తున్న నేపథ్యంలో పెంచిన ఎరువుల ధరలను తగ్గించి, రైతులందరికీ సకాలంలో సరిపడినన్ని ఎరువులను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో రాజుపాలెం, పిడుగురాళ్ళ, కారంపూడి, రెంటచింతల, దుర్గి మండల కేంద్రాలలో ఆందోళనా కార్యక్రమాలను నిర్వహించారు.

**దుర్గి, 9-9-11 :**

**ఎరువుల** ధరల తగ్గింపును డిమాండ్ చేస్తూ మండల కేంద్రమైన దుర్గిలో రైతులు అర్ధగంటసేపు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ప్రదర్శనగా వెళ్ళి తహశిల్‌దారుకు మెమోరాండం అందజేశారు.

ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కా॥ పాటిబండ్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ సామ్రాజ్యవాద బహుళజాతి ఎరువుల, పురుగుమందుల కంపెనీల అడుగులకు మడుగులొత్తుతూ భారత రైతాంగాన్ని నిలువుదోపిడీకి గురిచేయటాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో ఇంకా రైకూసం నాయకులు బుట్టి మరియదాసు; ఏపిఎఫ్‌టియు నాయకులు పి. శ్రీనివాసరావు, బి. శ్రీను, దుర్గారావు, గోపాలు తదితరులు పాల్గొన్నారు.

**రాజుపాలెం, 12-9-11 :**

**పంటలువేసి** ఎరువులు అందక రైతులు నానా ఇబ్బందులు పడతావుంటే, ఎరువుల కొరతఏమీ లేదని ప్రభుత్వం ప్రకటించటాన్ని రైతుకూలీసంఘం జిల్లా నాయకులు కా॥ రాంబాబు తీవ్రంగా ఖండించారు. ఎరువుల సమస్యపై రైతు కూలీ సంఘం రాజుపాలెం మండల కేంద్రంలో జరిపిన ధర్నాలో ఆయన ప్రసంగించారు. తొలుత గ్రామంలో రైతులు ప్రదర్శన నిర్వహించారు.

ఇంకా ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కా॥ పాటిబండ్ల కోటేశ్వరరావు, స్త్రీ విముక్తి సంఘటన నాయకులు కా॥ ఎం. నిర్మల; చెల్లయ్య, రెడ్డమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**పిడుగురాళ్ల, 14-9-11 :**

**ఎరువుల** ధరలను తగ్గించాలని, కౌలు రైతులతో సహా రైతులందరికీ బ్యాంకు రుణాలు సమకూర్చాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో రైతు, కూలీల ప్రదర్శన, అనంతరం మండల కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.

ఏపిఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కా॥ డి.వి.ఎన్. స్వామి ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతాంగాన్ని వ్యవసాయన్నుండి గెంటివేసి కార్పొరేట్ వ్యవసాయానికి మార్పు తీసుకోవటంలో భాగంగానే పాలకులు ఈ చర్యలన్నీ చేపడుతున్నారన్నారు. మన రాష్ట్రానికి 15 లక్షల టన్నుల ఎరువులు అవసరమని అంచనా వేస్తే సీజను గడిచిపోతున్నా 20 శాతం కూడా ఎరువులు రైతులకు అందుబాటులోకి రాలేదన్నారు. వ్యవసాయ రంగాన్ని ప్రపంచ బ్యాంకు షరతులకు, విధానాలకు దాసోహం చేస్తున్న ప్రభుత్వ విధానాలపై పోరాడాలన్నారు.

ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం జిల్లా నాయకులు కా॥ నీలాద్రి రాంబాబు; స్త్రీ విముక్తి సంఘటన జిల్లా నాయకురాలు కా॥ ఎం. నిర్మల; స్థానిక రైతుకూలీ, కార్మిక, యువజన నాయకులు పాల్గొన్నారు.

**రెంటచింతల, 15-9-11 :**

**బ్లాక్‌మార్కెట్‌లో** ఎరువుల నిల్వలను వెలికి తీయాలని, కృత్రిమ ఎరువుల కొరతను అరికట్టాలని, అధిక ధరలకు అమ్ముతున్న డీలర్ల లైసెన్సులను రద్దు చేయాలని రైతుకూలీ సఘం జిల్లా సహాయ కార్యదర్శి కా॥ పాటిబండ్ల కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. రైతుల డిమాండ్స్‌పై మండల కేంద్రమైన రెంటచింతలలో రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో తొలుత ప్రదర్శన నిర్వహించారు. అనంతరం స్థానిక మండల కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలనుండి రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ఇంకా రైతుకూలీసంఘం సభ్యులు కా॥ మరియదాసు; సత్తయ్య, వాసు, సురభి అమరలింగం తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

**కారంపూడి, 15-9-11 :**

**కౌలురైతులందరికీ** గుర్తింపుకార్డులిచ్చి బ్యాంకుల ద్వారా రుణాలందజేయాలని డిమాండ్ చేస్తూ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సినిమాహాల్ సెంటర్ నుండి బస్టాండ్ మీదుగా ప్రదర్శన నిర్వహించిన అనంతరం ఎంఆర్‌వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

ఏపిఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కా॥ డివిఎన్ స్వామి ఈ ధర్నానుద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయం దండగ మారిదనిపించి రైతులను భూముల నుండి పారద్రోలి, కార్పొరేటు, కాంట్రాక్టు సాగుకు పథకాన్ని సిద్ధం చేస్తున్న పాలకుల కుట్రలను వివరించారు. దేవాదాయ, ధర్మాదాయ భూముల కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులు, రుణాలు అందించాలని డిమాండ్ చేశారు.

ఇంకా ఈ కార్యక్రమంలో రైతుకూలీ సంఘం నాయకులు కా॥ జె. పద్మ, రాంబాబు, మరియదాసు, సైదా తదితరులు పాల్గొన్నారు. D


కారంపూడిలో ధర్నా


రాజుపాలెంలో ధర్నా

Printed, Published and Owned by P. Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010